J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 6 10.7.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి






# దేవుళ్ళను సైతం దోచేస్తున్నారు

- భక్తి పేరిట భుక్తి
- ఆధ్యాత్మికం ముసుగులో అరాచకాలు
- దేశవ్యాప్తంగా ఆలయాల కేంద్రంగా దోపిడీ
- పాలకమండళ్ళు, సేవా సంస్థల పేరిట స్వామి సొమ్ము స్వాహా

ఆశకు అంతులేకుండా పోతోంది. అక్రమాలకు అవధులు లేకుండా పోతున్నాయి. స్వార్థం కోసం విచక్షణ మరుస్తున్న కొందరు పాపాత్ములు, దేవుళ్ల కొలువైన గుళ్లలోనూ గూడుపుఠాణీలు సాగిస్తున్నారు. తమ స్వార్థం కోసం భగవంతుడి సొమ్మును చెరపడుతున్నారు. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పాలకమండలి నిర్వాకం వల్ల పరమపవిత్రమైన శ్రీవారి లడ్డూకి కళంకం ఏర్పడింది. శ్రీవాణి నిధులు పక్కదారి పట్టాయి. తాజాగా దేశం మొత్తం ఎంతో భక్తితో పూజించే శ్రీరాముడి జన్మస్థలం అయోధ్యలోనూ అపచారం జరిగింది. బాలరాముడి ఆలయ నిర్మాణానికి ప్రజలిచ్చిన విరాళాలు స్వాహారాయుళ్ల జేబుల్లోకి వెళ్లాయనే వార్త ప్రస్తుతం దేశవ్యాప్తంగా హల్‌చల్ చేస్తోంది. దీంతో... 'కాదేదీ కవితకి అనర్హం' అన్నట్లు, "కాదేదీ దోపిడీలకు అనర్హం" అన్న తరహాలో దేవుళ్లనూ అక్రమార్కులు వదలడం లేదని ప్రజలు, భక్తులు వాపోతున్నారు. దేశవ్యాప్తంగా చాలా పుణ్యక్షేత్రాల్లో ఇదే తంతు కనిపిస్తుండడం దిగజారుతున్న నైతిక, ఆధ్యాత్మిక విలువలకు నిదర్శనం.

## పుణ్యక్షేత్రాల్లో పాపాత్ములు!

దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ఆలయాల్లో దేవుడి సొమ్మును స్వాహా చేసే స్వార్థపరులు, దుర్మార్గుల సంఖ్య రోజు రోజుకూ ఎక్కువవుతోంది. కంచే చేను మేసిన విధంగా ఆలయ నిర్వాహకులు, అధికారులే అక్రమాలకు తెగబడుతూ భగవంతుడి ఆస్తులను కాజేస్తున్నారు. చివరికి ఎంతో భక్తిభావంతో పేద ప్రజలు సమర్పిస్తున్న విరాళాలను సైతం హాంఫట్ చేస్తూ దేవుడికే శఠగోపం పెడుతున్నారు. ఆధ్యాత్మికం ముసుగులో కేటుగాళ్లు రాజ్యమేలుతూ, విలువలను తుంగలో తొక్కుతూ నైతికతకు తిలోదకాలిస్తున్నారు. ఏమాత్రం జంకూగొంకూ లేకుండా పరమ పవిత్రమైన ఆలయాల్లోనే స్వామివారి సొమ్మును నిస్సిగ్గుగా సొంతానికి వినియోగించుకుంటూ స్వామిద్రోహానికి పాల్పడుతున్నారు. తాము చేసే తప్పు వల్ల లక్షలాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయనే ఇంగితాన్ని కూడా మరిచి మహాపాపం మూటకట్టుకుంటున్నారు. దేశంలో హిందువులకు పరమ పవిత్రమైన అయోధ్య రామమందిర నిర్మాణం, విరాళాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయనే విషయం ప్రస్తుతం దేశాన్ని ఊపేస్తోంది. మనదేశంలోనే

2లో



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక

నాలుగున్నర దశాబ్దాల వార్తా సంకలనం
జిల్లా పత్రికా ప్రపంచంలో సంచలనం
లాయర్
వార్తాపత్రికకి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

లాయర్ 45 YEARS

తాళ్ళూరి గిరినాయుడు
సి.ఇ.ఓ
బొల్లినేని కృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్




Bollineni College of Nursing
Bollineni School of Nursing
Bollineni Paramedical School
(Bollineni Krishnaiah Charitable Trust)
Clinical Affiliated to KIMS Hospital, Nellore.
Recognised by Indian Nursing Council, New Delhi
Permitted by Govt. of A.P. & A.P. Nursing Council, Vijayawada
Affiliated to Dr. N.T.R. University of Health Sciences, Vijayawada &
A.P State Allied and Health Care Professions Council, Vijayawada

Dhanalakshmipuram, Muthukur Road, Nellore - 524 003. (A.P.)
e-mail: bollinenicollege@gmail.com. Cell: 94902 50074, 95503 04244, 98668 81342

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాళి

దివంగత ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఈనెల 8న వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త..నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, ప్రజలకు ఆరోగ్యసేవలు, విద్యార్థులకు విద్యావకాశాలు, రైతులకు సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయ నేత డా. వైఎస్సార్ అని అన్నారు. వారి సేవలు స్ఫూర్తిదాయకమని, చిరస్మరణీయమని కొనియాడారు.



# దేవుళ్ళను సైతం దోచేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉండే హిందువులందరికీ జైశ్రీరామ్ అనే పదం ఎమోషన్, అయోధ్య అన్నది వారి స్వగ్రామాలకంటే ఎక్కువ. అలాంటిది ఎన్నో దశాబ్దాల పోరాటం, కోర్టు కేసులు, విచారణలు, కూల్చివేతలు, అరెస్టులు, విధ్వంసాలను దాటుకుని, ఎంతో ఆశతో, ఆర్తితో నిర్మించుకున్న అయోధ్య రామమందిర ఏర్పాటులోనూ అక్రమాలు రాజ్యమేలాయని, కోట్ల రూపాయల దేవుడి డబ్బు చేతులు మారిందని, ట్రస్టు నిర్వాహకులే ఈ దారుణా లకు ఒడిగట్టారనే విషయం సగటు భారతీయుడి హృదయాన్ని గాయపరుస్తోంది. ఇప్పటికే దేశంలో గుండుసూది నుండి విమానం వరకు ఏది తయారు కావాలన్నా లంచం ఇవ్వాల్సిందే. ఓ మంచి ఆటగాడి ప్రతిభ వెలుగులోకి రావాలంటే అమ్యామ్యాలు ముట్టజెప్పాల్సిందే. చివరికి శాస్త్రవేత్త పరిశోధనలు ప్రపంచానికి తెలియాలన్నా, విద్యార్థి సాధించిన ఘనత బాహ్య ప్రపంచానికి వెల్లడికావాలన్నా, ఎంతోకొంత ముట్టజెప్పాల్సిందే. అందుకే అధికారుల రోజువారీ జీవితంలో అవినీతి ఓ భాగంగానే ప్రజలు భావిస్తుంటారు. ఇక రాజకీయాలు, వైద్యరంగం, సినిమా, వ్యాపారం వంటి విషయాల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. అయితే చివరికి దేవుడి విషయంలోనూ, ఆధ్యాత్మిక చింతనకు సంబంధించిన అంశాల్లోనూ అక్రమాలు, అవినీతి, లంచగొండితనం ముఖ్యపాత్ర పోషిస్తుండడం దేశ దౌర్భాగ్యానికి, సమాజ దిగజా రుడు తనానికి నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో ప్రధాన ఆల యాల్లో సాగుతున్న అక్రమార్కుల ఆటకు అడ్డుకట్ట పడేదెప్పుడో..? అక్రమార్కులను శిక్షించే సమయం ఎప్పుడు ఆసన్నమవుతోందో అంటూ ప్రజలు దేవుళ్లకు మొరపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

### అయోధ్యలో అంతా స్వాహామయం!

"అంతా రామమయం...జగమంతా రామమయం" అంటూ పాడుకునే హిందువుల మనోభావాలు కొందరి స్వార్థం వల్ల తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఏకంగా రాముడు పుట్టిన అయోధ్య ఆలయం కూడా అక్రమార్కుల కదంబహస్తాల్లో చిక్కి శల్యమవు తోందనే విషయం ప్రజల మనస్సులను గాయపరుస్తోంది. ఇక అయోధ్య కుంభకోణం విషయానికొస్తే, ఇక్కడంతా స్వాహాలు, పైరవీల పర్వం సాగుతోందనే విషయం తాజాగా బయటపడింది. ముఖ్యంగా భక్తులిచ్చిన విరాళాలను లెక్కించే సమయంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించడమే కాకుండా, ఏకంగా బ్యాంకు లని సైతం బోల్తా కొట్టించారు. లెక్కించే సమయంలో కొన్ని రూ.500 నోట్లను కట్టల్లో అదనంగా చేర్చడం, వ్యాన్‌లో క్యాష్ బ్యాగులను తరలించే క్రమంలో వాటిని చాకచక్యంగా తీసేసుకోవడం చేశారు. పైగా బంగారు, వెండి ఆభరణాలను బూట్లు, వస్త్రాల్లో దాచి నెలల తరబడి దోపిడీ చేశారు. ఒకానొక తరుణంలో లెక్కింపు కోసం కొందరు సిబ్బంది సిండికేట్‌గా మారి సీసీ కెమెరాలకి అడ్డంగా రావడం, మిగిలిన వారు నోట్లను చోరీచేయడం పరి పాటిగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచి జూన్ 5వ తేదీ మధ్యకాలంలో సుమారు 70సార్లు చోరీ జరగడం గమనార్హం. ముఖ్యంగా డిపాజిట్ ఓచర్లు రాసే అనుకల్ప మిశ్ర, అతడి బావమరిది లవ్‌కుష్ మిశ్రా ఈ చోరీ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిట్ (ప్రత్యేక దర్యాప్తు సంస్థ) తేల్చింది. నిందితుల ఇంట్లో రూ.10 లక్షల వరకు నగదును అధికారులు సీజ్ చేశారు. కాగా లెక్కింపు సిబ్బందిని కొందరు అధికారులు, అయోధ్య ఆలయ ట్రస్టు సభ్యులు పైరవీలతోనే నియమించినట్లు కూడా సిట్ వెల్ల డించింది. ఇక లెక్కింపు పూర్తయిన సమయంలో కనీసం సిబ్బందిని తనిఖీ చేసే వ్యవస్థకూడా లేకుండాపోవడం, మొదట్లో లెక్కింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఈ కుంభకోణంలో ట్రస్టులోని పెద్ద తలకాయలకు సైతం భాగస్వామ్యం ఉందనేమో అన్న అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. పైగా లెక్కింపు సిబ్బంది తాము చోరీ చేసిన స్వామివారి ధనాన్ని ఆలయ సమీపంలోని మరుగుదొడ్లలో దాచిపెట్టి ఆ తర్వాత వచ్చి తీసుకుని, వాటిని వాటాలు పంచుకున్నారనే విషయం విశ్లేషకులను సైతం విస్తుపోయేలా చేస్తోంది. ఇదే సమయంలో స్వామివారి దర్శనం, ప్రసాదాల విక్రయాల్లోనూ భారీగా తప్పులు జరిగినట్లు తెలు స్తోంది. ఇక ఇదే క్రమంలో దేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన వారణాసి, కేదారినాథ్, బదరీనాథ్ సహా అనేక ఆలయాల్లో లెక్కకు మిక్కిలి తప్పులు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారని భక్తులు ఆవేదన చెందుతున్నారు. కొందరు నిజాయితీ పరులైన అధికారులు వాటిని బయటపెట్టేందుకు యత్నిస్తున్నా వారిని కొందరు నాయకులు వారిస్తున్నారనే సమాచారం దేశంలో ఆలయాలు, వాటి పాలకమండళ్లు, నిర్వహణకు సంబంధించిన దుస్థితిని తెలియజేస్తోందని ఆధ్యాత్మికవేత్తలు వాపోతున్నారు.

### తెలుగు రాష్ట్రాల్లోనూ...

తెలుగురాష్ట్రాల్లోని దేవాలయాల్లో సైతం పెద్దఎత్తున అక్ర మాలు చోటు చేసుకుంటున్నాయనేది నిర్వివాదాంశం. ముఖ్యంగా గతంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి కానుకల లెక్కింపుల్లో పలుమార్లు చోరీలు జరగడం తెలిసిందే. ఇక లడ్డూ, వడల తయారీలో నాణ్యతకు తిలోదకాలివ్వడం, నకిలీ నెయ్యితో లడ్డూలు తయారుచేయడం, వాటిని ఇష్టారాజ్యంగా విక్రయిం చడం, శ్రీవారి దర్శన టికెట్లు, శ్రీవారి సేవలు, శాలువాలు కొనుగోలు, విరాళాల సేకరణ వంటి అంశాల్లో భారీగా తప్పులు జరగడం తెలిసిందే. ఇక మాజీ ఈవో ధర్మారెడ్డి హయాంలో తిరుమల కొండ వ్యాపార కేంద్రంగా, అక్రమాలకి, అరాచకాలకు కేంద్రబిందువుగా మారిందనేది బహిరంగ రహస్యం. టికెట్లు అమ్ముకునేందుకు నాయకులు, పాలకమండలి సభ్యులు పోటీలు పడి మరీ ఓవరాక్షన్ చేసిన సందర్భాలు అనేకం.

అలాగే శ్రీశైలం, శ్రీకాళహస్తి, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయా ల్లోనూ అక్రమాలకు అంతేలేకుండా పోతోందనే విమర్శలున్నాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో రాహుకేతు పూజల కోసం భక్తులను నిలువుదోపిడీ చేయడం, రాహుకేతు పూజల ప్రాంతంలో డ్యూటీల కోసం అధికారులు, అర్చకులు తన్నుకు చావడం, స్వామివారికి వచ్చే పూజా సామగ్రి, వస్తు సామగ్రిని స్వాహా చేసేందుకు పోటీలు పడడం పరిపాటిగా మారింది. ఎందరు అధికారులు మారినా, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఆలయాల్లో అరాచకపర్వాలకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలున్నాయి.

ఏదేమైనా, దేశంలోని అన్ని రంగాల్లోకి అవినీతి చొరబడినట్లే ఆధ్యాత్మిక రంగంలోనూ అవినీతి విలయతాండవం చేస్తోందన్నది నిర్వివాదాంశం. ఈనేపథ్యంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి నీతిబాహ్యమైన చర్యలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. పాలక మండళ్లను రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రాలుగా మార్చినంత కాలం ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావడం అసాధ్యమనే చెప్పాలి. నిజమైన ఆధ్యాత్మిక వేత్తలను, సాధువులను గాలికొదిలి ఇష్టారాజ్యంగా అనుయాయు లకు పాలకమండళ్లలో చోటివ్వడం, నచ్చిన అధికారులకు కార్యనిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్లే దేవాలయాలు అవినీతి కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రభుత్వాధినేతలు, సాధుపుంగవులు, ఆలయ నిర్వాహకుల్లో మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే అక్రమాలకు చెక్ చెప్పే అవకాశం ఉంటుంది. లేకుంటే యథారాజ, తథా ప్రజ అన్నట్లుగా రాజకీయనాయకుల తరహాలోనే వారి అనుయాయులు కూడా ఆలయాల గద్దెలపై ఎక్కి తైతక్కలాడుతూ దేవుళ్లనే చెరపట్టే స్థాయికి చేరుతున్నారు. మరి ఈ పాపాత్ములకు తగిన శాస్తి ఎప్పుడు జరుగుతుందో..? ఈ అక్రమార్కుల భరతం పట్టే కాలం ఎప్పుడొస్తుందో..? ఆ దేవుళ్లకే తెలియాలి . అప్పటి వరకు అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాట. భక్తులు మాత్రం "రామా కనవేమిరా.. శ్రీ రఘురామా కనవేమిరా" అంటూ పాడుకోవాల్సిందే.. దీనంగా వేడుకోవాల్సిందే....!

## స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు..

# అధికారులకు శిక్షణ



అధికారులకి శిక్షణనిస్తున్న ప్రొ. బండి కామయ్య తదితరులు

స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు పెంచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. ఈ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్థానిక ఆర్థిక గణాంకాల అంచనాలు, వివిధ రంగాల పనితీరుపై అధికారుల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్, గ్రాస్ మండల్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌ల అంచనా విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం సామర్థ్య పెంపొందింపు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరుజిల్లాలో జూలై 2 నుంచి 16వ తేదీ వరకు వివిధ స్థాయిల్లో శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతాయి. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా శాఖాధిపతుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఎమిరిటస్ ప్రొఫెసర్ బండి కామయ్య ముఖ్య వనరుల వ్యక్తిగా పాల్గొని, స్వర్ణాంధ్ర-2047 విజన్, జీఎస్‌డీపీ, జీడీడీపీ, జీఎండీపీ అంచనా విధానాలు, 645 కీలక పనితీరు సూచికల పరస్పర అను సంధానం, విశ్లేషణ తదితర అంశాలపై అధికారులకు సవివరంగా శిక్షణ ఇచ్చారు.

# 17న.. బొడ్డుపల్లి పురుషోత్తం శతజయంతి



ప్రముఖ సారస్వతవేత్త, బహుగ్రంథకర్త.. వ్యాకరణవేత్త ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం శత జయంతి మహోత్సవం ఈనెల 17న నిర్వహిస్తామని వారి కుమార్తె.. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకు రాలు.. నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ కప్పర గిరిజాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి శతావధాని కొండపి మురళీకృష్ణ అధ్యక్షత వహిస్తారని, ఆచార్య సూరం శ్రీనివాసులు, 'ఉపన్యాస కళానిధి' ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ విశిష్ట అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా తమ తండ్రి ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం రచించిన 30 గ్రంథాలు తెలుగు భాషాభిమానులందరికీ చేరువచేయాలనే సదాశయంతో రూపొందించిన వెబ్‌సైట్‌ని పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఆచార్య బొడ్డుపల్లి వారి తనయులు డా. బొడ్డుపల్లి వీరరాఘవస్వామి, శేషాద్రిశేఖర్, మారుతీప్రసన్న తదితరులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# శ్రీ బ్రహ్మానందతీర్థస్వామి ఆరాధన..17న



కోవూరు సమీపంలోని ఇనమడుగు శ్రీ సత్యా నందాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి, శ్రీ సత్యానంద మహర్షుల వారి ప్రియశిష్యులు పూజ్యపాద శ్రీ బ్రహ్మా నందతీర్థస్వామి వారి 9వ ఆరాధన మహోత్సవం ఈనెల 17న జరుగుతుందని ఆశ్రమం వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 5 గంటలకు గీతా పారాయణం, 6 గంటలకు ఆధ్యాత్మిక ఉపన్యాసం, 8 గంటలకు ఉపాహారం, 9 గంటలకు వేదపారాయణం వగైరాలుంటాయని, శ్రీ జగదంబా తారకేశ్వరులకు 'రుద్ర పద క్రమార్చన' జరుగుతుందని తెలిపారు. వేదపండితులు రవీంద్రనాథశర్మ బృందం, వేదం రాధాకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులందరూ పాల్గొనవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# దేశద్రోహం చేస్తున్న జగన్!



## • మంత్రి ఆనం ఫైర్

సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్న రావణ్ జోసఫ్‌ని సమర్ధిస్తూ, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ఇస్తాననడం దేశద్రోహానికి పాల్పడినట్లేనని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. ఈనెల 8న రాష్ట్ర సచివాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి, జగన్ తీరుపై ధ్వజమెత్తారు. తమ రాజకీయస్వార్ధం కోసం ఇలా విద్వేషాలను రెచ్చగొడుతున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం సెక్యులరిజం, మతసామరస్యం వైపు ప్రభుత్వాలు సమాజాన్ని ముందుకు నడిపిస్తుంటే, మరోవైపు ఇటీవల కొంతమంది వ్యక్తులు తమ వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుండడం దారుణమన్నారు. భావప్రకటన స్వేచ్ఛతో పాటు, ప్రజా శాంతిని.. సామాజిక సామరస్యతను, మత విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రతిఒక్కరికీ ఉందన్నారు. అయితే సమాజంలో ఇప్పుడు విద్వేషాలు రెచ్చగొట్టేవారు, వారిని సమర్ధించే కొన్ని రాజకీయపార్టీల తీరు ప్రజాస్వామ్యానికి తూట్లుపొడిచేదిగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గొడ్డలిపార్టీ అలాంటి వాటికి మద్దతు తెలుపుతూ వారితో చేతులు కలపడం ఇంకా దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని, మత విద్వేషాలతో, వ్యక్తిగత దూషణలు చేయడం ఘోరమని, వాటికి జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ఇవ్వడం ఇంకా దుర్మార్గమని ఆయన దుయ్యబట్టారు. రావణ్‌జోసఫ్ అనే వ్యక్తి ద్వారా జగన్‌రెడ్డి చేస్తున్న కుతంత్రం, కుట్ర..రాజ్యాంగ విలువలను తగ్గించేదిగా ఉందన్నారు. స్వేచ్ఛను అడ్డంపెట్టుకుని హిందూ దేవతలను, హిందూ మతాన్ని అవమానించే హక్కు వీళ్ళకి ఎవరిచ్చారన్నారు. దేశంలో స్నేహపూరిత వాతావరణాన్ని చెడగొట్టే అలాంటి వారిపై, వాటిని సమర్ధించే నాయకులపై ఉపా చట్టం 1967 ప్రకారం రాజద్రోహం కింద కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. మతాలను రెచ్చగొట్టేవారికి మద్దతివ్వడం చూస్తే.. రాజ్యాంగం ప్రకారం నీవు కూడా దేశద్రోహివేనని అనడం తప్పా అని ఆయన జగన్‌ని ఉద్దేశించి ప్రశ్నించారు. మీ పాలన(వైసీపీ)లో సోషల్ మీడియాలో పోస్టులు పెడితే దేశద్రోహం కేసులు పెట్టలేదా?.. వారిని జైళ్ళలో పెట్టలేదా అని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టేవారికి మద్దతిస్తామంటున్న మీమీద కూడా దేశద్రోహం కేసులు పెట్టాల్సిన అవసరం ఉందా లేదా అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారిందని ఆయన అన్నారు.

### కులాలు.. మతాల మధ్య

# చిచ్చుపెట్టేవారిని సమర్ధిస్తారా?

## జగన్‌కి.. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సూటిప్రశ్న



జగన్‌రెడ్డి గారూ!..కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులను మీరు ప్రోత్సహిస్తారా?..అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జగన్‌రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవుళ్లపై, సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులకు జగన్ మద్దతు ఇస్తుంటే ఇదంతా మాట్లాడాల్సి వస్తోందని, 'నా హిందూ ధర్మానికి, దేవుళ్ళకు అవమానం జరిగితే స్పందించాల్సిన బాధ్యత సాటి భారతీయుడిగా తనపై ఉంది'.. అని ఆయన అంటూ, 'ఇప్పుడు హిందువులపై మాట్లాడాడు, రేపు క్రిస్టియన్, ముస్లింలపై మాట్లాడడని మీరు గ్యారెంటీ ఇస్తారా జగన్‌రెడ్డిగారూ?.. అని ఆయన ప్రశ్నించారు. 'బాధతో అడుగుతున్నాను.. రాముడిని, రామాయణాన్ని, మహాభారతాన్ని గురించి రావణ్ మాట్లాడిన మాటలు విన్నారా?.. మీరెలా సమర్ధిస్తారు?.. అని కోటంరెడ్డి నిలదీశారు. 'నేను ఎమ్మెల్యేగా కాకుండా ఓ సామాన్య భారతీయుడుగా మాట్లాడుతున్నా, నేను భారతీయుడిని, హిందువుని. పర మతాలతో కలిసి నడిచే ధర్మం నాకు హిందూ ధర్మం నేర్పింది. అన్ని మతాలను నేను గౌరవిస్తా'నని ఆయన అన్నారు. దేవుళ్ళని నమ్మడం, నమ్మకపోవడం వారి ఇష్టం. అయితే, దేవుళ్ళని తిట్టే అధికారం మీకు ఎవరిచ్చారు? ఒకపక్క హే.. రామ్ అంటావు, మరో పక్క ప్రశ్న రావణ్‌ని ఎలా సమర్ధిస్తావు?.. అనుచితవ్యాఖ్యలు చేస్తున్న అలాంటివారిని సమర్ధించడం దారుణమన్నారు. ప్రజా జీవితంలో జగన్‌రెడ్డి కొనసాగాలంటే కోట్లాదిమంది భారతీయులకు క్షమాపణ చెప్పాలన్నారు.


# పొట్టేపాళెం వంతెన..త్వరలోనే ప్రారంభం

## • టీడీపీ అధికారప్రతినిధి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు–జొన్నవాడ రహదారిలో నిత్యం వేలసంఖ్యలో వాహనాలు వెళ్తున్న ఆ మార్గంలో ఉన్న పొట్టేపాళెం కలుజు వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈనెల 8న టీడీపీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ వంతెన లేదని, దీని కోసం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గతంలో అనేక ఉద్యమాలు చేశారని, గత వైసీపీ ప్రభుత్వంలో ఇది పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని గిరిధర్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనులు వేగవంతమయ్యాయని, 5.60 కోట్లతో పనులు జరుగుతున్నాయని, మరో రెండు నెలల్లో అంటే ఆగస్టులో కానీ, సెప్టెంబరులో కానీ ఈ వంతెనను ప్రారంభిస్తామని చెప్పారు. వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయ ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







లాయర్
జులై 10, 2026

# ప్రకృతి విపత్తులతో.. ప్రపంచం విలవిల!

ప్రపంచాన్ని గడగడ వణికించే ఎల్‌నినో రానే వచ్చేసింది. ఇప్పుడు ఏ దేశంలో చూసినా దీని మాటే వినపడుతోంది. ఎల్‌నినో అంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ఇప్పటికే వాతావరణమంతా మారిపోయి, తీవ్రమైన ఉష్ణోగ్రతలతో భూమి అగ్నిగుండంగా తయారైంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రకృతి విపత్తులు అన్ని దేశాలనూ అతలాకుతలం చేస్తున్నాయి. అసలు ఎల్‌నినో అంటే ఏమిటి?.. దీనివల్ల ప్రపంచానికి వస్తున్న ముప్పు ఏమిటి?..అంటే, ఇదొక అసాధారణమైన విపత్తు అనే చెప్పాలి. సుమారు 19,880 కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించివుండే పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు భయంకరంగా పెరిగిపోవడాన్నే ఎల్‌నినో అంటారు. దీంతో ప్రకృతి వికృతాకృతి దాల్చి భూగోళంపై తన ప్రతాపాన్ని చూపుతుంటుంది. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని ప్రాంతాల్లో కరువులు, తుఫాన్లు, వరదలు వంటివి ముంచుకొస్తాయి. ఇప్పటికే ఈ ఎల్‌నినో వల్ల ఆస్ట్రేలియాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. యూరప్‌లో ఎండల దెబ్బకి రోడ్లు సైతం కరిగిపోతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ప్రాథమిక అంచనాల ప్రకారం యూరప్‌లోని ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్ దేశాల్లో ఇప్పటికే కనీసం 3700 మందికి పైగానే మరణించి ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. చైనాలో పెద్దపెద్ద భవనాల మీదినుంచి నీటిని స్ప్రింకర్ల ద్వారా వెదజల్లుతూ మండిపోతున్న ఎండవేడిమి నుంచి ప్రజలను కాపాడుతున్నారు. ఎల్‌నినో విపత్తులు తీవ్రమవుతుండటంతో అన్ని దేశాలూ వణికిపోతున్నాయి. బ్రెజిల్‌లో ఉత్తర ప్రాంతాల్లో కరువుకాటకాలు, దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలతో ఆ దేశం అల్లకల్లోలంగా ఉంది. పెరూ దేశంలో భారీవర్షాలు, వరదలతో పాటు కొండచరియలు విరిగిపడడం వంటివి జరుగుతున్నాయి. ఇండోనేషియాలో వర్షాభావ పరిస్థితులతో పాటు పొగమంచు పెద్దసమస్యగా పరిణమించింది. యునైటెడ్ స్టేట్స్‌లో దక్షిణాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు పోటెత్తుతున్నాయి. దక్షిణాఫ్రికాలో కరువు రాకాసి విజృంభిస్తుంటే, తూరు ఆఫ్రికా కుండపోత వానలు, వరదలతో అల్లాడిపోతోంది. మనదేశంలో కూడా ఎల్‌నినో ప్రభావం బాగా ఉంటోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. వానలు లేక పంటలు పండక రైతులు ఆవేదనలో ఉన్నారు. మరికొన్ని చోట్ల అకాల వర్షాలు ప్రజాజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. గత వారంరోజుల్లో వరదలు ముంచుకొచ్చి ముంబైలో 13మంది ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం, కొద్దిరోజుల క్రితమే ఎల్‌నినో కాస్తా సూపర్ ఎల్‌నినోగా మారిపోయింది. దీని ప్రభావంతో వచ్చే నవంబరు నుంచి జనవరి 2027 మధ్య మరింత ఉష్ణోగ్రతలు సంభవించనున్నాయి. 1950వ సంవత్సరం తర్వాత అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో ఇదేనని కూడా అంటున్నారు. ఎల్‌నినో సూచిక ఇప్పటికే ప్రమాద స్థాయికి చేరిందని, ఉష్ణోగ్రతలు..ఎండ వేడిమి తీవ్రత అంతకంతకూ పెరుగుతున్నాయని, వచ్చే సెప్టెంబరు నాటికి అవి మరింతగా పెరుగుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. ఎల్‌నినో పడగ నీడ భారత్‌పై కూడా పడుతుందని, రుతుపవనాలు బలహీనమై వర్షాలు తగ్గిపోయి కొన్ని ప్రాంతాల్లో కరువు దాపురించవచ్చని, మరికొన్ని చోట్ల జలప్రళయాలు కూడా రావచ్చని నిపుణులు భావిస్తున్నారు. జులై నెలాఖరుకల్లా ఎల్‌నినో మనదేశంలో పూర్తిస్థాయిలో విస్తరిస్తుందని, ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో దాని ప్రభావం మరింత ప్రమాదకరంగా తయారయ్యే అవకాశం కూడా ఉంటుందని భారత వాతావరణ శాఖ చెప్తోంది. అనేక ప్రాంతాల్లో వానలు లేక వ్యవసాయరంగం కుదేలైపోతుందని, మరికొన్ని చోట్ల కరువు వస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వర్షాలు లేక తీవ్రమైన కరువు ఏర్పడుతుందని, రాజధాని ఢిల్లీ ఎండల వేడికి మరింత మండిపోతుందని అంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశంలో మరికొన్ని చోట్ల జలవిలయాలు కూడా ముంచుకొస్తాయని, ముఖ్యంగా తమిళనాడుకు వరదల ముప్పు తప్పేలా లేదని వాతావరణ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులతో ఏర్పడే ప్రకృతి విపత్తులతో.. ఎప్పుడు ఎక్కడ కరువులొస్తాయో, ఎప్పుడు వరదలొస్తాయో, ఎప్పుడు ఎండలు మండిపోయి ప్రజలకు సాగునీరు, తాగునీరు దొరక్క విలవిలలాడాల్సి వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఎల్‌నినో వంటి అసాధారణ పరిస్థితులపై ప్రజలు అవగాహన కల్పించుకుని, ఆ విపత్తులను ఎదుర్కొనేందుకు వెంటనే ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వాలు ఈ ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన తక్షణ రక్షణ చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. ముఖ్యంగా ఆహారం, తాగునీరు వగైరాలకు ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సమాయత్తం కావాల్సి ఉంది.

# ఉగ్రవాదులకు.. తప్పదు శిక్ష

మనసులో మాట 105

ఉగ్రవాదానికి మతం ఉండదు, మానవత్వం పట్ల చిన్న చూపు, అకారణంగా అమాయకులను పొట్టన పెట్టుకోవడమే దాని ఏకైక లక్షణం అని కాలం ఎప్పటికప్పుడు నిరూపిస్తూనే ఉంది. 2008 జులై 26న గుజరాత్ చారిత్రక నగరం అహ్మదాబాద్‌ను నెత్తుటి మడుగుగా మార్చిన వరుస బాంబు పేలుళ్ల ఉదంతం భరతజాతి గుండెపై చెరగని గాయం. ఆనాటి ఘాతుకానికి పాల్పడిన 38 మంది ఉగ్రవాదులకు ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్షను గుజరాత్ హైకోర్టు సమర్థించడం చట్టం సర్వోన్నత శక్తిని, భారత న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పునరుద్ఘాటించింది. ఈ తీర్పు ఉగ్రవాదంపై దేశం సాగిస్తున్న రాజీలేని పోరాటంలో ఒక కీలక ఘట్టం. భారత న్యాయ చరిత్రలోనూ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలోనూ ఒక మైలురాయి. బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల పరిహారాన్ని నిర్దేశిత కాలపరిమితిలోగా (మార్చి 2027) చెల్లించాలని కూడా గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

2008లో కేవలం 70నిమిషాల వ్యవధిలో 21చోట్ల జరిగిన పేలుళ్లకు సామాన్య ప్రజలు బలయ్యారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కుప్పకూల్చాలనే దుష్ట సంకల్పంతో ఉగ్రమూకలు ఈ దారుణానికి ఒడిగట్టాయి. ముఖ్యంగా, రద్దీగా ఉండే మార్కెట్లు, బస్సులే కాకుండా, మొదటి విడత పేలుళ్లలో గాయపడిన క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న సివిల్ హాస్పిటల్, ఎల్‌జీ హాస్పిటల్‌లను టార్గెట్ చేస్తూ ఉగ్రమూకలు బాంబులు పేల్చడం ఆనాటి రాక్షసత్వానికి పరాకాష్ఠ. మానవ చరిత్రలో ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం అత్యంత అమానవీయం.

56 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. కొందరు వినికిడి శక్తిని కూడా కోల్పోయారు. 2002 గోద్రా అనంతర పరిణామాలకు ప్రతీకారంగానే ఈ ఘాతుకానికి ఒడిగట్టామని ఇండియన్ ముజాహిదీన్ ప్రకటించుకోవడం, సమాజంలో మతపరమైన చీలికలు తెచ్చేందుకు జరిగిన కుట్రను స్పష్టం చేసింది.

ఈ కేసు విచారణ కాలంలో ఎన్నో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల నుంచి (గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, కర్ణాటక, హైదరాబాద్‌తో సహా) నిందితులను అరెస్ట్ చేశారు.

విచారణ కాలంలో నిందితులు జైలులో సొరంగం తవ్వి తప్పించుకోవాలని చూడటం వంటివి చోటుచేసుకున్నప్పటికీ, మన భద్రతాసంస్థలు, అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ చూపిన వృత్తిపరమైన నిబద్ధత నేడు ఈ చట్టపరమైన విజయానికి పునాది వేసింది. వందమందికి పైగా నిందితులను గుర్తించి, పక్కా ఆధారాలతో కోర్టు ముందు నిలబెట్టడం ద్వారా దర్యాప్తు సంస్థలు తమ సత్తాచాటాయి.

భారత న్యాయవ్యవస్థ ఎప్పుడూ భావోద్వేగాల ఆధారంగా కాకుండా, పక్కా సాక్ష్యాధారాల ప్రాతిపదికన మాత్రమే నడుస్తుందని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. 2022లో ప్రత్యేక కోర్టు ఇచ్చిన అరుదైన తీర్పును (ఒకే కేసులో 38 మందికి మరణశిక్ష విధించడం భారత చరిత్రలో ఇదే తొలిసారి) హైకోర్టు అన్ని కోణాల్లోనూ పరిశీలించి సమర్థించింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (SIMI) మాజీ అధినేత సఫ్దర్ నాగోరి వంటి కీలక సూత్రధారులకు ఉరిశిక్ష ఖరారు కావడం ఉగ్రవాద నెట్‌వర్క్‌ల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అదే సమయంలో, సరైన ఆధారాలు లేని 28 మందిని నిర్దోషులుగా విడుదల చేయడాన్ని, ఒకరికి క్షమాభిక్ష ప్రసాదించడాన్ని గమనిస్తే, చట్టం ఎంత నిష్పాక్షికంగా వ్యవహరించిందో అర్థమవుతుంది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలను తోటి నిందితుల ఒత్తిడికి లొంగి ఉపసంహరించుకున్న నలుగురు అప్రూవర్లకు కూడా శిక్ష విధించడం ద్వారా కోర్టు న్యాయ పరిధిని పటిష్టం చేసింది.

అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్, గుజరాత్ ఏటీఎస్ సంయుక్తంగా చూపిన వృత్తిపరమైన నిబద్ధత నేడు ఈ చట్టపరమైన విజయానికి పునాది వేసింది. దర్యాప్తు అధికారులు ఏకంగా 1,163 మంది సాక్షులను విచారించి, పక్కా ఫోరెన్సిక్, డిజిటల్ సాక్ష్యాధారాలతో 7,015 పేజీల చార్జ్‌షీట్‌ను కోర్టు ముందు ఉంచడం అభినందనీయం. భద్రతా కారణాల దృష్ట్యా 26 మంది కీలక సాక్షుల గుర్తింపును రహస్యంగా ఉంచడం మంచి విషయం. ఈ తీర్పు కేవలం కొందరు నేరస్థులకు పడిన శిక్ష మాత్రమే కాదు, భారతదేశ సార్వభౌమాధికారానికి, అంతర్గత భద్రతకు భంగం కలిగించాలనే శక్తులకు గట్టి హెచ్చరిక. ఎంతటి క్లిష్టమైన కుట్రలైనా చట్టం దృష్టి నుంచి తప్పించుకోలేవనే సందేశం స్పష్టమైంది. అమాయకుల రక్తాన్ని చిందించే ఏ భావజాలానికైనా ఆధునిక ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. ఉగ్రవాదం అనేది కేవలం కొన్ని ప్రాణాలను తీసేది కాదు; అది ఒక దేశ ఆర్థిక ప్రగతిని, సామాజిక సామరస్యాన్ని మట్టుబెట్టే మహమ్మారి. భయాందోళనలను ఆయుధంగా చేసుకుని, మతం లేదా సిద్ధాంతాల ముసుగులో అమాయకుల రక్తాన్ని చిందించే ఏ శక్తీ మానవాళికి మేలు చేయలేదు. అది సమాజంలో నమ్మకాన్ని హరించి, తరతరాల అభివృద్ధిని వెనక్కి నెడుతుంది. శాంతియుత సహజీవనానికి ఉగ్రవాదమే అతిపెద్ద శత్రువు.

ఆలస్యంగానైనా అహ్మదాబాద్ బాధితుల ఆత్మలకు ఈ తీర్పుతో శాంతి చేకూరింది. ఉగ్రవాదంపై దేశం అవలంబిస్తున్న 'జీరో టాలరెన్స్' విధానానికి ఈ తీర్పు మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఉగ్రవాదులు ఎంతటి వ్యూహాలు పన్నినా, చివరకు న్యాయం గెలుస్తుందని నిరూపించిన ఈ చారిత్రక తీర్పు దేశ భద్రతా, న్యాయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# ఆంధ్రుల భావోద్వేగాలతో ఆడుకుంటున్న జగన్!

ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అంశం ఇప్పటికే 12 సంవత్సరాలుగా రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ఇలాంటి సమయంలో "మావిగన్‌ను రాజధానిగా ప్రకటించి 2029 ఎన్నికలకు వెళ్తాము" అని మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన ప్రకటన ప్రజల్లో మరింత గందరగోళాన్ని సృష్టించేలా ఉంది. రాజధాని అనేది ఎన్నికల నినాదంగా ఉపయోగించే అంశం కాదు. అది రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన విషయం. అలాంటి అంశంపై ప్రజల భావోద్వేగాలతో రాజకీయ ప్రయోజనం కోసం ఆడుకోవడం బాధ్యతాయుత నాయకత్వానికి నిదర్శనం కాదు. ఒకప్పుడు మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు 'మావిగన్' అంటూ మరో కొత్త ప్రతిపాదనతో ప్రజల ముందుకు రావడం తుగ్లక్ పాలనను గుర్తుచేస్తోంది. స్పష్టమైన ప్రణాళిక, ఆర్థిక సాధ్యత, ప్రజల ఆమోదం వంటి అంశాలను పక్కనపెట్టి కేవలం రాజకీయ లాభం కోసం కొత్త రాజధాని పేర్లను తెరపైకి తేవడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధం. ప్రజలు ఇప్పుడు రాజకీయ ప్రకటనల కంటే స్థిరత్వాన్ని, అభివృద్ధిని, పారదర్శకతను కోరుకుంటున్నారు. రాజధాని అంశంపై తరచూ మారుతున్న వైఖరులు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయి. వైసీపీ అధినేత, ఆ పార్టీ నాయకులూ ఎన్నికల లబ్ది కోసం కాకుండా రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించడం మంచిది. లేదంటే వచ్చే ఎన్నికలలో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైపోవడం ఖాయం!

*సీ. హెచ్. రమేష్‌రెడ్డి, ఒంగోలు.*

# స్వదేశ బాట పడుతున్న భారతీయులు!

ఇటీవలి కాలంలో అమెరికాలో స్థిరపడిన లేదా ఉద్యోగాలు చేస్తున్న కొంతమంది భారతీయులు తిరిగి స్వదేశానికి రావడం స్వాగతించ తగ్గ పరిణామం. ఒకప్పుడు అమెరికా అంటే అపారమైన అవకాశాల దేశంగా భావించిన యువత, ఇప్పుడు మారుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమ భవిష్యత్తును భారత్‌లోనే నిర్మించుకోవాలని ఆలోచిస్తున్నారు. ఈ ధోరణి సమాజంలో చర్చనీయాంశంగా మారింది. కఠినతరమైన వలస విధానాలు, వీసా అనిశ్చితులు, కుటుంబానికి దూరంగా జీవించడం, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అంశాలు ఈ నిర్ణయానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు, భారతదేశంలో ఐటీ, స్టార్టప్‌లు, పరిశోధన, తయారీ వంటి రంగాల్లో అవకాశాలు పెరగడం కూడా వారిని స్వదేశం వైపు ఆకర్షిస్తోంది. విదేశాల్లో అనుభవం, సాంకేతిక నైపుణ్యం సంపాదించిన భారతీయులు తిరిగి దేశానికి రావడంవల్ల పరిశ్రమలు, పరిశోధన, ఆవిష్కరణలకు ఎంతో మేలు జరుగుతుంది. వారి అనుభవం యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ అవకాశాన్ని ప్రభుత్వం సమర్థంగా వినియోగించుకుని, స్వదేశానికి తిరిగి వస్తున్న నిపుణులకు అనుకూల విధానాలు రూపొందించాలి. వారి పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించాలి. మనవాళ్ళ ప్రతిభ దేశ అభివృద్ధికి వినియోగపడేలా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, విద్యావంతులు సమన్వయంతో ముందుకు సాగితే "బ్రెయిన్ డ్రెయిన్" స్థానంలో "బ్రెయిన్ గెయిన్" సాధ్యమవుతుంది. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి!

*- యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.*

# మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు నగర నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సుడిగాలి పర్యటన చేశారు. కాలువలు, పాఠశాలల ఆధునీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని 42, 43 వార్డుల పరిధిలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ కేటాయించిన 5.5 ఎకరాల వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్ పనులను మరింత వేగవంతం చేయాలని, రాబోయే అక్టోబర్‌లో విజయదశమి నాటికి 3 అంతస్తుల భవనాన్ని సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అత్యాధునిక స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, గతంలో వచ్చిన వరదల దుస్థితి మళ్ళీ నెల్లూరుకు రాకూడదనే ఉద్దేశంతో 50 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన 15 మేజర్ కాలువల ఆధునీకరణ పనులను శరవేగంగా పూర్తి చేయిస్తున్నామని, డిసెంబర్ నాటికి అవి పూర్తవుతాయని చెప్పారు.

### వైకాపా విమర్శలపై మండిపాటు

ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని వైకాపా నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు. నెల్లూరు 14వ డివిజన్‌లోని మల్లెల సంజీవయ్య స్కూల్, ఏసీ నగర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయకులమని పించుకోవడానికి వైకాపా నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని, ఇలాంటి తీరుతో ప్రజల దృష్టిలో వారే చెడ్డవారవుతారని హెచ్చరించారు. వీఆర్ స్కూల్ తరహాలోనే ఈ స్కూల్లో కూడా కేవలం క్లాస్ రూమ్‌లే కాకుండా.. కంప్యూటర్, రోబోటిక్స్, టింకరింగ్ ల్యాబ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్, సోషల్, ఇంగ్లీష్ ల్యాబ్స్, మ్యూజిక్ రూమ్స్ మరియు లైబ్రరీ వంటి దాదాపు 18 రకాల అదనపు యాక్టివిటీ గదులను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు.



### క్రికెట్ ఆడిన మంత్రి :

ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక్కసారిగా చిన్నపిల్లల్లా మారిపోయి నెల్లూరు మూలాపేట బాలికోన్నత పాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్ ఆడి సందడి చేశారు. అబ్దుల్ అజీజ్ బౌలింగ్ వేయగా మంత్రి నారాయణ భారీ షాట్ కొట్టి అక్కడున్న విద్యార్థులు, అధికారుల చప్పట్లతో గ్రౌండ్ మొత్తాన్ని హోరెత్తించారు. ఒకప్పుడు అయ్యవారిగా బెత్తం పట్టిన చేత్తో ఇప్పుడు మంత్రి అయినా సరదాగా క్రికెట్ బ్యాట్ పట్టి విద్యార్థులకి సంతోషం కలిగించారు.

# కూటమి ప్రభుత్వంతోనే ఉదయగిరికి అభివృద్ధి



సిసి రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఉదయగిరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. గత రెండేళ్లలో ఉదయగిరి సంక్షేమం కోసం రూ.1,098.79 కోట్లు కేటాయించామని, ఇప్పటికే నాలుగు పరిశ్రమలకు ఆమోదం లభించగా, వాటి ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సోమవారం ఉదయగిరికి చేరుకున్న మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి నారాయణ కొనియాడారు. తాను కూడా 'నారాయణ నేత్రజ్యోతి' కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు.

# హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## సంక్షేమ సంక్షేమ మంత్రి డా. డోలా



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సౌకర్యాల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం నెల్లూరుజిల్లా కావలిలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మంత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాలికల వసతి గృహం, బాలికల కళాశాల వసతి గృహం 1,2లలో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు బెడ్, నైట్ డ్రెస్, స్వెట్టర్స్ ఇస్తామని తెలిపారు. బాలికల భద్రత కోసం అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

## మత్స్యశాఖకి

# కొత్త జేడీ



నెల్లూరు జిల్లా మత్స్య శాఖకి కొత్త జాయింట్ డైరెక్టర్(జేడీ) వచ్చారు. ఈ స్థానంలో జేడీగా ఉన్న కె.శాంతి మే 31న ఉద్యోగ విరమణ పొందడంతో, ఇన్‌చార్జిగా ఒంగోలు మత్స్య శాఖ జేడీ సిహెచ్ శ్రీనివాసరావును నియమించారు. తాజాగా ఈనెల 6న విశాఖ పట్నంలో మత్స్యశాఖ జేడీగా ఉన్న టి.లక్ష్మణరావును ఆ స్థానంలో నియమించగా, ఆయన సోమవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చాన్‌బాషా, కార్యాలయ సిబ్బంది ఆయన్ను స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

## పంపిణీ చేసిన వేమిరెడ్డి దంపతులు



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

ఆర్థికంగా వెనుకబడినవారు, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 5గురు లబ్ధిదారులకు రూ.7.57 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇప్పటి వరకు తన కార్యాలయం ద్వారా మొత్తం 144 మంది లబ్ధిదారులకు రూ.1.91 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా నెల్లూరులోని తమ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 20 మంది లబ్ధిదారులకు చెక్కులను ఇచ్చారు.

# ఎస్సీ కమిషన్ ఛైర్మెన్‌తో.. రవిచంద్ర భేటీ




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ కేఎస్.జవహర్‌ను విజయవాడలోని వారి కార్యాలయంలో ఇటీవల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో రవిచంద్ర చర్చించారు. ఈ సందర్భంగా ఆయనను బీద రవిచంద్ర శాలువాతో సన్మానించారు. ఎస్సీ కమిషన్ సభ్యులు డా.శ్రీపతిబాబు, డా.గౌతమ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో.. బీఎంఆర్



ముంబైలో ఇటీవల జరిగిన కార్పొరేట్ లాస్ (సవరణ) బిల్లు-2026పై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమావేశాల్లో రాజ్యసభ సభ్యులు, జేపీసీ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు, నమోదిత పెట్టుబడి సలహాదారులు, అంతర్జాతీయ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు డెలాయిట్, ఈవై, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ, విలువ నిర్ధారణ సంస్థలు, ప్రముఖ న్యాయ సలహా సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, బ్యాంకింగ్ మరియు ఆర్థిక సంస్థలైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, జీఐసీ రీ, సిడ్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో జరిగిన విస్తృత చర్చల్లో ఆయన పాల్గొన్నారు. కార్పొరేట్ లాస్ (సవరణ) బిల్లు-2026లో పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, కార్పొరేట్ పాలనలో పారదర్శకత, వ్యాపార నిర్వహణలో సులభతరం, స్టార్టప్‌లు మరియు ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ, నియంత్రణ వ్యవస్థల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై జరిగిన చర్చల్లో ఆయన తన అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. వివిధ రంగాల ప్రతినిధులు చేసిన సూచనలను ఆసక్తిగా విని, వాటిపై సభ్యులతో కలిసి సమగ్రంగా చర్చించారు.

# గొల్లకందుకూరు నుంచి తిరుమలకు పాదయాత్ర

నెల్లూరు రూరల్‌లోని గొల్లకందుకూరు నుంచి 60 మంది భక్తులు ఈనెల 5న తిరుమలకు కాలినడకన బయలుదేరారు. సకాలంలో వానలు కురవాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ యాత్ర నిర్వాహకులు గుడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ, దామోదరల ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగింది. వారం రోజులపాటు నడచి వారంతా తిరుమలకు చేరుకొని, శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

# ఆర్ఎస్ఆర్ స్కూల్‌ను సందర్శించిన వేమిరెడ్డి



ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు నగరంలోని 'ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్'ను నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల సందర్శించారు. ఆయన చొరవతో, సీఎస్ఆర్ నిధులతో ఆ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులు త్వరగా అందుబాటులోకి వచ్చేలా పనులను వీలైనంత వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఇదే సమయంలో పాఠశాల సమీపంలోని నడక మార్గాన్ని కూడా అభివృద్ధి చేయాలని వాకర్స్ చేసిన విజ్ఞప్తిని ఎంపీ వేమిరెడ్డి అంగీకరించారు. అంతేకాకుండా తెల్లవారుజామున, రాత్రి వేళల్లో వాకింగ్ చేసే వారికి ఇబ్బంది లేకుండా, ఆ మార్గం చుట్టూ వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

# ఆకట్టుకున్న..'విశ్వసాహితి' కవిసమ్మేళనం




పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్, కొల్లి రమావతి తదితరులు

నెల్లూరులో విశ్వసాహితి కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న జరిగిన శతాధిక కవి సమ్మేళనం..'పినాకిని శత సాహితీ వాహిని' అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్, విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లి రమావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రముఖ కవి వన్నం బ్రహ్మయ్య రచించిన 'అక్షర వసంతం' పుస్తకాన్ని గజల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కేపీఎన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'మా అమ్మాయి పెళ్ళికి మీరంతా రండి' చలనచిత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. 'సాహితీ తారకం' కవిత పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులిచ్చి సత్కరించారు. కళావేదిక అధ్యక్షులు వన్నం బ్రహ్మయ్య, గౌరవాధ్యక్షులు కేపీఎన్, ప్రతినిధులు శానంపూడి మహేశ్వరి, మురిగిపూడి సతీష్‌కుమార్, పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు, డీకేడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ జట్ల ఎంపిక..11న

జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న సీనియర్ పురుషుల, మహిళల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి బీ.చంద్రశేఖర్ తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఈ ఎంపికలో పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.






## నెల్లూరు కబుర్లు

# అల్లూరి త్యాగస్ఫూర్తి..యువతకు ఆదర్శం

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




అల్లూరు సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈనెల 4న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం, చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవి..చిరస్మరణీయమైనవని అన్నారు. బ్రిటిష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందని పేర్కొన్నారు. దేశభక్తి, త్యాగం, సేవాభావం వంటి గొప్ప విలువలను యువత అలవర్చుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ, జిల్లా రెవిన్యూ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ని బలోపేతం చేయాలి

### -పార్టీ శ్రేణులకు ఏఐసీసీ ప్రతినిధుల పిలుపు-



మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రతినిధి గణేష్‌కుమార్

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు మరింత పట్టుదలతో పనిచేయాలని ఏఐసీసీ ప్రతినిధులు గణేష్‌కుమార్, మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. ఈనెల 7న నెల్లూరులోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అందరూ కృషిచేయాలన్నారు. ప్రతి వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు పోటీచేసి, ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు పాల్గొన్నారు.

# అలరించిన..జానపద కళా ఉత్సవాలు

నెల్లూరు పురమందిరంలో ఈనెల7న రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక సమితి సహకారంతో, జానపద కళా వేదిక అధ్యక్షుడు కృష్ణదాసు ఆధ్వర్యంలో జరిగిన యక్షగానం, జానపద గీతాలు, పండరి భజనలు, కోలాటాలు, కులుకు భజనలు, వీధిబాగోతం, డప్పుల విన్యాసాలు వగైరాలు ఆకట్టుకున్నాయి. ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, కళావేదిక ప్రతినిధులు పాల్గొని కళాకారులను సన్మానించారు.

# కార్పొరేషన్‌లో ప్రమోషన్లు

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగులుగా పనిచేస్తున్న పలువురికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు (ప్రమోషన్లు) లభించాయి. కార్పొరేషన్ కమిషనర్ వై.నందన్ ఈనెల 7న నగరంలోని తన చాంబర్‌లో వారికి ఆ ఉత్తర్వులను అందజేశారు.





# నాయకర్‌ని కలసిన..నెల్లూరు నేతలు

జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ ప్రక్రియలో భాగంగా ఇటీవల నెల్లూరుకు వచ్చిన జనసేన నాయకుడు..ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నారాయణ నాయకర్‌ను మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి.. ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు విడివిడిగా కలుసుకున్నారు. గౌరవపూర్వకంగా ఆయనను శాలువతో సత్కరించారు. స్థానిక వేదాయపాళెంలోని కార్యాలయంలో సోమిరెడ్డి ఆయనను శాలువతో సత్కరించి, ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అభివృద్ధి పథకాల గురించి చర్చించారు. బీద రవిచంద్ర మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఆయన్ను కలుసుకుని ఆత్మీయంగా సన్మానించారు.

### గిరిజన బడులకు..

# 'జయభారత్' వాటర్ ప్యూరిఫైయర్లు




వాటర్ ప్యూరిఫైయర్‌ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమం ద్వారా మంజూరైన ఆర్‌వో వాటర్ ప్యూరిఫైయర్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 6న పంపిణీ చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు వాటిని అందజేశారు. నగరంలోని జయభారత్ హాస్పిటల్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ ఆర్‌వో వాటర్ ప్యూరిఫైయర్లను అందించారంటూ వారిని కలెక్టర్ అభినందించారు. మనుబోలు, సంగం, సైదాపురం, గూడూరు మండలాల పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలకు వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జేసీ వెంకటేశ్వర్లు, ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్, జయభారత్ ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

# 'నారాయణ' ఉచిత వైద్యం



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నారాయణ వైద్యులు

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సేవా సంకల్పంతో నిరుపేద ప్రజల కోసం చేపట్టిన 'నారాయణ నేత్ర జ్యోతి', 'నారాయణ దంత సురక్ష' ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌లు ప్రజలకు బాగా ఉపయోగపడుతున్నాయి. ఇటీవల నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ బంగ్లాతోటలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సేవా యజ్ఞంలో భాగంగా ఇప్పటివరకు నెల్లూరు నగరంలో 9,300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారని, 5వేల మందికి పైగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారని తెలిపారు. వైద్యాధికారులు సుధా, రఫీ, 9వ డివిజన్ అధ్యక్షులు పాకాల పెంచలయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో ఆడంబర సంబరంగా.. వెంకయ్య'నాయకుడు' పుస్తక పరిచయం!



వెంకయ్యనాయుడి జీవిత కథ ఆధారంగా మాశర్మ రచించిన "వెంకయ్య నాయకుడు" పుస్తకం జూన్ 23న హైదరాబాదులో ఆవిష్కరించబడిన విషయం తెలిసిందే. ఆ పుస్తక పరిచయ కార్యక్రమం జూలై 5వ తేదీ ఆదివారం సాయంత్రం వెంకయ్య జన్మభూమి నెల్లూరులో జరిగింది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఆడంబర సంబరానికి గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికయ్యింది. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో పాటు భారత 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, పుస్తక రచయిత మాశర్మ ఈ వేడుకలో ప్రధాన అతిథులుగా వేదికపై ఆశీనులయ్యారు. వెంకయ్య తనయ స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపావెంకట్ నిర్వహణా సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గ్రంథ రచయిత మాశర్మ "వెంకయ్య నాయకుడు" పుస్తక సారాంశాన్ని సభకి వివరించి పరిచయం చేశారు. అనంతరం వేదికపైనున్న అతిథులందరూ ఉపన్యసిస్తూ వెంకయ్య నాయకుడిలోని క్రమశిక్షణని, సేవాభావాన్ని, అనుకున్నది సాధించే వరకు తపించే ఆయన కార్యదక్షతని కొనియాడారు.

## అమరావతిని రాజధానిగా చేయమని నేనే చెప్పా!

**- వెంకయ్యనాయుడు**

చివరిగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రజా జీవితంలోకి రావాల్సిన వాళ్లు కష్టపడడం నేర్చుకోవాలని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్నారు. రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరం ఉందని, అయితే రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న యువత నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్న దేశం భారత్ అని, యువతరం దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉండాలని ఆ రోజుల్లో తానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సూచించానని చెప్పారు. అమరావతి అన్ని ప్రాంతాలకు దగ్గరగా ఉండే రాజధాని అని, అయితే.. అనుకున్న సమయంలోగా వేగంగా పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆత్మకథ రాయండని చాలామంది కోరారని, రాస్తే వాస్తవాలు రాయాలని, సమకాలీన నేతలు చాలామంది గురించి కఠోర నిజాలు రాయాల్సి వస్తుందని, వారు ఇబ్బందిపడతారు కాబట్టి తాను రాయదల్చుకోలేదని చెప్పారు. తన జీవితంలో జరిగిన అనేక సంఘటనలతో పాటు, తన రాజకీయ ప్రస్థానం గురించి భావితరాలకి తెలియజేయాలని అనేకమంది మిత్రులు కోరడంతో జీవిత చరిత్ర రాయడానికి అంగీకరించానని చెప్పారు. భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు వెంకయ్య కుటుంబ అభిమానులు, ఆప్తులు, ఆత్మీయులు అధిక సంఖ్యలో ఈ సంబరంలో పాల్గొన్నారు.

---

### 6,545 కోట్లతో..

# ఆత్మకూరు అభివృద్ధి!

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



జెడ్పీ హైస్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో పయనింపజేస్తామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఈ నియోజకవర్గంలో రూ.6,545 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కూడా ఆయన తెలిపారు. ఇటీవల ఆయన ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామాన్ని సందర్శించగా, గ్రామస్తులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి ఆనం ఆవిష్కరించారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో పూర్తయిన నూతన జెడ్పీ హైస్కూల్ భవనం, సీసీ రోడ్లు, పశువుల షెడ్లు ప్రారంభించడంతో పాటు శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లోనూ మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆత్మకూరు మండలంలోని ఈ గ్రామానికి రాలేకపోయినా తనను రెండోసారి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఆశీర్వదించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. చెర్లోయడవల్లిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ నుంచి రూ.5 లక్షల నిధులు అందిస్తున్నామన్నారు. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా దాదాపు రూ.50 లక్షలు సమకూర్చి ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించడం అభినందనీయమని కొనియాడారు.

## సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తిచేయిస్తాం :

రైతాంగం అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా చెప్తూ, సోమశిల ఉత్తరపు కాలువ పొడిగింపు, 42ఆర్ కాలువ పనులు ఎన్నో అడ్డంకులు ఎదురైనా సరే, వాటిని పూర్తిచేసే దిశగా కృషిచేస్తామన్నారు. గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి రైతాంగానికి సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మిగిలిన పంటకాలువల పనులను కూడా దశలవారీగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి ఆనం అందజేశారు.

---

# నెల్లూరు యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

- **'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవంలో ఎంపీ విపిఆర్**

నెల్లూరు వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో యువత ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి గడప ముందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలను తీసుకురావడం అభినందనీయమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

నెల్లూరు నగరంలో మొట్టమొదటి మల్టీ-కంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల నెల్లూరు-గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విపిఆర్ మాట్లాడుతూ, ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటువల్ల చదువుకుంటున్న విద్యార్థులకు, కళాశాల విద్య పూర్తి చేసుకున్న యువతకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రపంచం చాలా వేగంగా మారుతోందని, ఆ వేగాన్ని అందుకోవడం నెల్లూరు వంటి నగరాల్లో కొంచెం సవాలుతో కూడుకున్నదైనప్పటికీ, రెనిల్‌రెడ్డి కోమిట్ల లాంటి వ్యక్తులు ఐటీ రంగంలోనూ యువతకు ప్రోత్సాహమిచ్చేందుకు ముందుకు రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఒకప్పుడు నెల్లూరు ట్రంక్‌రోడ్డులో రెనిల్ తాతగారు ఒక చిన్న సైకిల్ షాప్ నిర్వహించేవారని, అలాంటి సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన రెనిల్, బాగా చదువుకుని విదేశాలకు వెళ్లి ప్రపంచస్థాయి కంపెనీలను స్థాపించారని చెప్పారు. ఆ తర్వాత, పుట్టిన ఊరికి ఏదైనా మేలు



నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభిస్తున్న వేమిరెడ్డి దంపతులు, మేయర్ సుజాత, అబ్దుల్ అజీజ్, రెనిల్

చేయాలనే తలంపుతో నెల్లూరుకు తిరిగి వచ్చి, 2022లోనే టెర్రాలాజిక్ కంపెనీ ప్రారంభించారని, ఆయన విజయప్రస్థానం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్, సంస్థ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి కోమిట్ల దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ రంగంలోనూ నెల్లూరు ముందడుగు - వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు నగరానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడం శుభపరిణామమని, 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ఏర్పాటుతో ఐటీరంగంలోనూ నెల్లూరు ముందడుగు వేసినట్లయిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆకాంక్ష అని, ఆమేరకు కృషి జరగాలని అన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెల్లూరుకు తీసుకొచ్చి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభించిన రెనిల్ రెడ్డిని ఆమె అభినందించారు. ఈ హబ్ ద్వారా ఏర్పడుతున్న సంస్థలు రానున్న రోజుల్లో జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు.

---

# ప్రకృతి వ్యవసాయానికి..అంతర్జాతీయ అవార్డు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమానికి అంతర్జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026" లభించిందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.కన్నయ్య తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి మరోసారి ప్రపంచస్థాయిలో గుర్తింపు దక్కడం గర్వకారణమన్నారు. స్వీడన్‌కు చెందిన 'కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్' వారు పర్యావరణ పరిరక్షణ-ఆహార వ్యవస్థల పరివర్తన కోసం ఇచ్చే ఈ అవార్డు ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ అవార్డు అని, ఈ పురస్కారం లభించడం దేశానికే గౌరవాన్ని తీసుకువచ్చిందని ఆయన అన్నారు.




# రామతీర్థంలో 'వీపీఆర్ అమృతధార'

**● వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



వాటర్‌ప్లాంట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

రామతీర్థంలోని శ్రీ రామ లింగేశ్వరస్వామి దేవ స్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌక ర్యార్థం ఏర్పాటు చేసిన విపిఆర్ అమృతధార మినరల్ వాటర్ ప్లాంట్‌ను కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి నూతన కార్యాలయాన్ని కూడా ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతమ్మ మాట్లా డుతూ, పది రోజుల పాటు వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు కనుక, వారి దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, ఆ విజ్ఞప్తికి స్పందించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వెంటనే వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేశారని చెప్పారు. విపిఆర్ అమృతధార ద్వారా 2016 నుంచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా విపిఆర్ ఫౌండేషన్ చేపడుతోందన్నారు. ఇప్పటివరకు నెల్లూరుజిల్లాలో 200కుపైగా వాటర్‌ప్లాంట్లను అందుబాటులోకి తీసుకు వచ్చామని, ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే 30కు పైగా ప్లాంట్లు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీ రామలింగేశ్వరస్వామివారి సన్నిధిలో ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం విపిఆర్ ఫౌండేషన్‌కు అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రామతీర్థం కోనేరు చుట్టూ రోడ్ల అభివృద్ధికి జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మన్న తన నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఏటూరి హరిరెడ్డి, మండల కోఆర్డినేటర్ అడపాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు చెముకుల శ్రీనివాసులు, కొమ్మి శ్రీధర్, మత్స్యకార సంఘం నాయకుడు ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని ప్రతిభకు..
# జడ్పీ ఛైర్‌పర్సన్ అభినందనలు



చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆనం అరుణమ్మ

కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వ హించిన ఇంటిగ్రేటెడ్ ఆన్‌లైన్ ట్రైనింగ్‌లో అత్యంత ప్రతిభచూపిన నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం చిలకలమర్రి జిల్లా పరిషత్ హైస్కూల్ గణిత ఉపాధ్యా యుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డిని ఇటీవల నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అభినందించి సన్మానిం చారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఐజీఓటీ-కర్మయోగి కోర్సుల్లో రికార్డు స్థాయిలో 1460 కోర్సులను పూర్తిచేసి జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధిం చినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నుంచి కూడా ఆ ఉపాధ్యాయుడు ఇటీవల బర్త్‌డే గ్రీటింగ్స్ అందుకున్న విషయం తెలి సిందే. జిల్లా పరిషత్ స్కూల్‌లో పనిచేస్తున్న ఆ ఉపాధ్యాయుని అసాధారణ ప్రతిభను మెచ్చుకుంటూ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆయన్ను నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో శాలువతో సత్కరించారు.

# అక్రమ మద్యం.. అరికట్టాలి

**అధికారులకు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ఆదేశం**



అధికారులతో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

జిల్లాలోకి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్-ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన నెల్లూరు జిల్లా పరిధిలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్లవారీగా నమోదైన కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నమోదైన కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, రవాణా మరియు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్టు దుకాణాలను, బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రస్తుత మద్యం దుకాణాల లైసెన్సుల గడువు మరో మూడు నెలలు మాత్రమే ఉన్నందున, లైసెన్సు ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించ డంతో పాటు, మద్యం దుకాణాలలో ఎటువంటి అనధికార సరుకు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులలో త్వరితగతిన చార్జ్ షీట్లు దాఖలు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగాన్ని కట్టడి చేయడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే మద్యం క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో అరెస్టు కావలసిన ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేసి, సంబంధిత కేసులలో చార్జ్ షీట్లు దాఖలు చేయాలని సూచించారు. ఎన్‌డీపీఎస్, గంజాయి మరియు ఇతర కేసుల ముద్దాయిలను తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య, సహాయ కమిషనర్ పి.దయాసాగర్‌తో పాటు జిల్లాలోని 11 ప్రొహిబిషన్-ఎక్సైజ్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్

# నేత్రపర్వంగా లక్షతులసి పూజ



ఎమ్మెల్యే సునీల్‌కి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

గూడూరు, రాజావీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాల యంలో జరుగు తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 4వ తేదీ లక్ష తులసి పూజ, పుష్పయాగో త్సవం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయదాతలుగా తలమంచి సిద్దారెడ్డి, రాజేశ్వరి, తలమంచి వినోద్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీ సుధ, తలమంచి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సింధు వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహనరావు పర్యవేక్షించారు.

# త్వరితగతిన సమస్యల పరిష్కారం



ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ అరుణకుమారి

గూడూరు డివిజన్ పరిధిలోని సమస్యలు వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో అరుణకుమారి తెలి పారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించారు.

# రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం



ఈ నెల 5వ తేదీ గూడూరు రోటరీ భవన్‌లో 2026-27కి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా టి.సురేష్‌రెడ్డి, కార్యదర్శిగా నాగ సునీల్, ఉపాధ్యక్షులుగా మల్లు విజయకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రిపోర్టు కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 26 లక్షల రూపాయల మేర పలు సేవా కార్యక్రమాలు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి 5లక్షలు విలువచేసే ఫిజియోథెరపి కిట్, మిగతా మొత్తంతో చెన్నూరు, తిప్పవరప్పాడు, సైదాపురం, గూడూరు పరసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 2027-28 రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ జోషి, అసిస్టెంట్ గవర్నర్ జోతిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి, మెహర్మణి, రొటేరియన్లు దశరథరామిరెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, బాలకృష్ణంరాజు, యల్లసిరి గోపాల్‌రెడ్డి, మునిగిరీష్, శ్రీధర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# ఎల్.ఏ.పి స్కూల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యఅతిథులు, పాఠశాల వ్యవస్థాపకులు, సిబ్బంది

గూడూరు, శారదానగర్‌లోని ఎల్.ఏ.పి పాఠశాలలో ఇటీవల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల వ్యవస్థాపకులు బుస్సారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి జన్మదినం సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.ఈ.వో రవూఫ్ మాట్లాడుతూ.. ఎల్.ఏ.పి పాఠశాల అంటే క్రమశిక్షణకు మారుపేరు అని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు అకడమిక్ బహుమతులను అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకులు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధేష్ణ, సీబీఐ ఇన్‌స్పెక్టర్(న్యూఢిల్లీ), ఎల్.ఏ.పి పూర్వవిద్యార్థి ఎస్.కిరణ్, ప్రిన్సిపల్ నమశ్శివాయ, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 11న లోక్‌అదాలత్

గూడూరు రెండో పట్టణంలోని కోర్టు భవనంలో 7వ అదనపు జిల్లా న్యాయ మూర్తి వెంకట నాగపవన్ ఆదేశాల మేరకు ఈ నెల 11న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జూనియర్ సివిల్ న్యాయ మూర్తి సీహెచ్ మధుబాబు పోలీసు, ఎక్సైజ్ మరియు న్యాయవాదులతో ఇటీవల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న రాజీ అయ్యే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని పోలీ సులను ఆదేశించారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులతో మాట్లా డాలని ఆయన వివరించారు. సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, కవి క్రిష్ణయ్య, రజనీకాంత్‌రెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కిట్లు వితరణ



గూడూరు పట్టణంలోని అమరావతి హాస్పిటల్‌లో ఇన్నర్ వీల్ క్లబ్ నూతన అధ్యక్షురాలుగా ప్రమాణ స్వీకారం చేసిన నిర్మల, తన మొదటి సేవా కార్యక్రమంగా దయాలసిస్ సెంటర్లో ఉన్న రోగులకు మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తనూజాను ఘనంగా సన్మానించారు. సుప్రియ, విష్ణు వందన, మాధురి, డాక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

# 15లో పునాది, 18లో దిశ, 21లో స్పష్టత!.. 'కెరీర్ రోడ్‌మ్యాప్'

మనిషి జీవిత ప్రయాణం ఒక్కసారిగా రూపుదిద్దుకోదు. అది చిన్న చిన్న దశల్లో, చిన్న చిన్న నిర్ణయాల్లో, చిన్న చిన్న అలవాట్లలో నెమ్మదిగా నిర్మించబడుతుంది. 'పునాది బలంగా ఉంటే భవనం ఎత్తుగా నిలుస్తుంది'. అనే మాట విద్యా ప్రపంచానికి సరిపోతుంది. పదిహేను, పద్దెనిమిది, ఇరవై ఒకటి –ఈ మూడు వయస్సులు విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పే మూడు కీలక దశలు. ఈ దశలను అర్థం చేసుకుని, వాటికి సరైన మార్గదర్శకత్వం ఇస్తే, యువతకు స్పష్టమైన దారి, బలమైన భవిష్యత్తు, స్థిరమైన కెరీర్ నిర్మాణం సాధ్యమవుతుంది.

15ఏళ్ల వయసు అంటే విద్యార్థి మనసు మొదటిసారి తన సొంత ప్రపంచాన్ని నిర్మించడం ప్రారంభించే దశ అన్నమాట. ఈ వయసులో పిల్లవాడు ఏ విషయాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నాడు, ఏ పనులు అతనికి సహజంగా వస్తున్నాయి, ఏ విషయాలు ఉత్సాహం రేకెత్తిస్తున్నాయి..ఇవన్నీ భవిష్యత్తు దిశకు తొలిసంకేతాలు. 'చిన్నవయసులో వేసిన విత్తనం, పెద్ద వయసులో వృక్షం అవుతుంది'. ఈ వయసులో అభిరుచులు స్పష్టంగా కనిపిస్తాయి. కొందరికి గణితం అంటే మక్కువ, సమస్యలను పరిష్కరించడం అంటే ఆనందం. అలాంటి పిల్లలు తర్వాత విశ్లేషణాత్మక రంగాల్లో.. ఇంజనీరింగ్, డేటా సైన్స్, ఫైనాన్స్ వంటి వాటిలో మెరుగ్గా రాణిస్తారు. మరికొందరికి చిత్రలేఖనం, సంగీతం, కథలు రాయడం, వీడియోలు తయారు చేయడం అంటే ఇష్టం. వీరు డిజైన్, మీడియా, రచన, సినిమా, గేమింగ్ వంటి రంగాల్లో భవిష్యత్తు నిర్మించగలరు. ఇంకొందరు చిన్న చిన్న యంత్రాలను విప్పి మళ్లీ అమర్చడం, వస్తువుల పనితీరు తెలుసుకోవడం వంటి పనుల్లో ఆసక్తి చూపుతారు. వీరు మెకానికల్, ఎలక్ట్రికల్, రోబోటిక్స్ వంటి రంగాలకు సహజంగా దగ్గరవుతారు. అలవాట్లు కూడా ఈ దశలోనే రూపుదిద్దుకుంటాయి. సమయపాలన, చదువులో క్రమశిక్షణ, ప్రశ్నలు అడిగే ధైర్యం, చిన్న లక్ష్యాలు పెట్టుకుని సాధించే పద్ధతి.. ఇవన్నీ పదిహేనులోనే ఏర్పడతాయి. 'అలవాటు మనిషిని మనిషిగా చేస్తుంది'. అది ఈ దశకు బలమైన పునాది. ఈ వయసులో తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆసక్తులను గమనించి ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైనది. ఆసక్తిని అణచివేయడం కాదు, దానికి సరైన దిశ చూపడం అవసరం. ఎందుకంటే 15లో కనిపించే చిన్న సంకేతాలు, తర్వాత జీవితాన్ని మలుపు తిప్పే పెద్ద నిర్ణయాలుగా మారుతాయి.

***18 ఏళ్ళ వయసు..***
***విద్యార్థి జీవితంలో కీలక మలుపు***

18 ఏళ్ళ వయసు విద్యార్థి జీవితంలో మొదటి పెద్ద మలుపు. ఇంటర్మీడియట్ తర్వాత ఏ కోర్సు? ఏ రంగం? ఏ దారి? ఈ ప్రశ్నలు విద్యార్థిని మాత్రమే కాదు, తల్లిదండ్రులను కూడా ఆలోచింపజేస్తాయి. "దారి తప్పితే గమ్యం దూరం" అవుతుంది కూడా. పద్దెనిమిదిలో తీసుకునే నిర్ణయం జీవితాన్ని 10, 15 సంవత్సరాలు బాగా ప్రభావితం చేస్తుంది. ఈ దశలో విద్యార్థి ప్రపంచాన్ని కొంచెం పెద్దగా చూస్తాడు. అతనికి ఇప్పుడు తెలిసి ఉండాల్సినవి: STEM రంగాలు, డిజైన్ మరియు క్రియేటివ్ రంగాలు, బిజినెస్ మరియు మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్, సోషల్ సైన్సెస్, అలాగే నూతన రంగాలు AI, డేటా, గేమింగ్, ఫిల్మ్‌మేకింగ్. ఈ రంగాలన్నింటి గురించి అవగాహన పెంచుకోవడం, వాటిలో తనకు సరిపోయే దిశను గుర్తించడం అత్యంత కీలకం. కోర్సు ఎంపికలో 3 అంశాలు ముఖ్యమైనవి. ఆసక్తి, సామర్థ్యం, భవిష్యత్ అవకాశాలు. ఆసక్తి లేకుండా తీసుకున్న కోర్సు భారమవుతుంది. ఆసక్తితో తీసుకున్న కోర్సు ఆనందమవుతుంది. ఒక అమ్మాయి పద్దెనిమిదిలో బయాలజీ తీసుకుంది. కానీ ఆమెకు అసలు ఇష్టం డిజైన్. రెండు సంవత్సరాలు చదివి చివరికి డిజైన్‌కి మారింది. ఆమె చెప్పిన మాట: "దిశ తప్పితే చదువు భారమవుతుంది; దిశ సరైతే చదువు ఆనందమవుతుంది'. ఈ మాట పద్దెనిమిదిలో దిశ నిర్ణయించే ప్రాముఖ్యతను స్పష్టంగా చూపిస్తుంది.

***21లో దిశా స్పష్టత అవసరం :***

21 ఏళ్ల వయసు విద్యార్థి జీవితంలో రెండో పెద్ద మలుపు. ఇప్పుడు అతని చేతిలో డిగ్రీ, కొంత అనుభవం, కొంత స్పష్టత, కొంత గందరగోళం కూడా ఉంటుంది. ఈ దశలో అత్యంత ముఖ్యమైనది దిశా స్పష్టత. 'లక్ష్యం ఉన్నవాడికి దారి కనిపిస్తుంది'..అనే సూక్తి ఈ దశకు అద్భుతంగా సరిపోతుంది. ఈ వయసులోనే.. ఉద్యోగంచేయాలా? ఉన్నత విద్య చేయాలా? స్టార్టప్ ప్రారంభించాలా? పరిశోధనలోకి వెళ్లాలా?..ఈ నిర్ణయం అతని భవిష్యత్తు రూపకల్పనను నిర్ణయిస్తుంది. ఈ వయసులో నైపుణ్యాల అభివృద్ధి అత్యంత కీలకం. కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, టీమ్‌వర్క్, డిజిటల్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్ అనుభవం, ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియో..ఇవన్నీ 21లోనే నిర్మించాలి. "చదువు పుస్తకాల్లోఉండదు, అనుభవంలో ఉంటుంది" అనే సూక్తి ఈ దశకు బలమైన మార్గదర్శకం. 21లో విద్యార్థి తన భవిష్యత్తును 2 సంవత్సరాల లక్ష్యం, 5 సంవత్సరాల లక్ష్యం, 10 సంవత్సరాల దిశగా విభజించి చూడాలి. ఈ విధంగా చూసినప్పుడు భవిష్యత్తు స్పష్టంగా కనిపిస్తుంది. జీవిత ప్రయాణం ఒకే దశలో నిర్ణయించబడదు. అది 15, 18, 21 అనే మూడు మెట్లు ఎక్కినప్పుడు పూర్తవుతుంది. ఈ మూడు దశలను అర్థం చేసుకుని, వాటికి సరైన మార్గదర్శకత్వం ఇస్తే, మన యువతకు స్పష్టమైన దారి, బలమైన భవిష్యత్తు, స్థిరమైన కెరీర్ నిర్మాణం సాధ్యమవుతుంది. 'దారి చూపే పెద్దలు, ఆ దారిన నడిచే పిల్లలు..ఇద్దరూ కలిసి భవిష్యత్తు నిర్మిస్తారు'అనే లోకోక్తి ఈ ప్రయాణానికి అద్భుతమైన ముగింపు.

వచ్చే వారం: విదేశాల్లో చదువు : అవకాశాలు, సిద్ధత, విజయానికి మార్గదర్శకాలు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA



E-mail: reddyu@gmail.com

# సమ్మెకాలపు జీతం ఇప్పించండి

## సీఐటీయు నాయకుల వినతి



కమిషనర్ నందన్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయు నాయకులు

గతంలో సమ్మెలో పాల్గొన్న మునిసిపల్ కార్మికులందరికీ సమ్మెకాలపు జీతం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, నేటికీ ఆ జీతం రాలేదని సీఐటీయు నాయకులు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కార్మికనాయకుడు పెంచలనరసయ్య కమిషనర్‌కి కార్మికుల సమస్యలు వివరించారు. గతంలో కార్మికులు 14 రోజులపాటు సమ్మె చేశారని తెలిపారు. వారికి ఆ మేరకు జీతం ఇస్తామన్నారని, అయితే కొందరు కార్మికులు ఉద్యోగ విరమణ చేసినా, సమ్మెకాలపు జీతం మాత్రం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయన కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు.

# మెస్ చార్జీలు పెంచాలి - ఎస్ఎఫ్ఐ



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలంటూ ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 6న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు త్రివిక్రమ్, నరేంద్ర మాట్లాడుతూ, మెస్‌చార్జీలను కనీసం 3వేల రూపాయలకు పెంచాలని వారు కోరారు. కూటమి పాలన వచ్చి రెండేళ్ళయినా విద్యారంగానికి సంబంధించిన సమస్యలేమీ పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో సెమిస్టర్ పరీక్షల సమయంలో హాల్‌టిక్కెట్లు తీసుకునేందుకు విద్యార్థులకు ఎంతో ఇబ్బందిగా ఉందన్నారు. జీఓ నెంబరు77ని రద్దుచేసి పీజీ విద్యార్థులకు న్యాయం చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీని నేటికీ నెరవేర్చలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

# గిరిజనులకు పలసరుకులు



గిరిజనులకి పలసరుకుల పంపిణీ

గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో నవశక్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు పల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 24 సొసైటీ చైర్మన్ అల్లూరు కరుణాకర్‌రెడ్డి, పల్లంపర్తి మధుసూదన్ రెడ్డిలు పాల్గొని, వారి చేతులమీదుగా పల సరుకులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు సాయి చందు, గుణశేఖర్, మాధవ్ కుమార్, శ్రీను, చంద్ర, సుబ్రమణ్యం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి.. పర్యావరణం కాపాడండి

పచ్చదనం–పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్–నెల్లూరు విభాగం ప్రతినిధి హరికృష్ణ పిలుపునిచ్చారు. ఈనెల 6న ఆయన నెల్లూరు వెంగళరావునగర్‌లోని మునిసిపల్ పాఠశాలలో పీఎంపీల సంఘం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ నెల్లూరు విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ళూరి అవినాష్, పీఎంపీల సంఘం నాయకులు జయప్రకాష్, శాకవరపు వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంజులవాణి, గుండాల నరేంద్రబాబు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణయోగ మందిరంలో..

# 19న ఆధ్యాత్మిక క్విజ్ పోటీలు

## - - ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డా. అజయ్‌కుమార్ - -



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డా. అజయ్‌కుమార్


సమాజహితం కోసం విద్యార్థినీ విద్యార్థులలో ఆధ్యాత్మిక చింతన, ధర్మ చింతనపై ఆసక్తి–అవగాహన కలిగించేందుకు అవధూత దత్తపీఠం–నెల్లూరుశాఖ.. శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్టువారు ఈ నెల 19న నెల్లూరులోని శ్రీకృష్ణయోగ మందిరంలో క్విజ్ పోటీల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'హైందవ సనాతన ధర్మము, పురాణేతిహాసాల' ఆధారంగా ఈ 'జ్ఞాన–విజ్ఞాన ప్రశ్నావళి' (క్విజ్) ఉంటుందని ఆ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డా.సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. మైసూరులోని అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ, దత్తపీఠం ఉత్తరాధిపతి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీల ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆరోజు ఉదయం 9 గంటల నుంచి 3 విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒక విభాగం, 6 నుండి 10వతరగతి వరకూ రెండవ విభాగం, ఇంటర్ నుండి పీజీ వరకూ చదువుతున్న వారు మూడవ విభాగంగా పోటీ నిర్వహణ ఉంటుందని, పాల్గొనే విద్యార్థినీవిద్యార్థులను నలుగురు లేక అయిదుగురిగా జత చేసి క్విజ్ టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో విజేతలకే గాక, పాల్గొనే వారందరికీ కూడా సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఈ పోటీలకి వారం రోజుల ముందుగా, ఈనెల 12వతేదీలోగా నెల్లూరు దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం–అష్టలక్ష్మి మందిరం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు..94415 48655 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తీర్చండి

## • ఏఐటీయుసి నాయకుని విజ్ఞాపన

ఆర్టీసీలో పనిచేస్తున్న తమ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి యామాల మధు కోరారు. ఈనెల 6న ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి ఆయన వినతిపత్రం సమర్పించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ఎంఓయు ప్రకారం కాంట్రాక్టర్లు జీతం ఇవ్వడం లేదని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకు ఖాతాల ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా, ఆర్టీసి ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు వైద్యసౌకర్యం కల్పించాలని విజ్ఞప్తిచేశారు.

# కళ్యాణ వైభవం...!




ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వొద్దిబోయిన శ్రీనివాసులురెడ్డి - శ్రీవాణిల కుమారుడు సాయి కిరణ్‌రెడ్డి - లావణ్యరెడ్డిల వివాహం ఈ నెల 3వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభదీవెనలు.

# ఆదర్శనేత.. సంక్షేమ ప్రదాత డా. వైఎస్సార్

## ● జయంతి రోజున నాయకుల నివాళి



మహానేత, సంక్షేమ పథకాల ప్రదాత.. మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ప్రజల హృదయాలలో ఆయనది శాశ్వతమైన స్థానమని నెల్లూరులోని వైఎస్సార్సీపీ నాయకులు కొనియాడారు. ఈనెల 8న డా.వైఎస్ జయంతి సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్సీపీ నాయకుడు..ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సుపరిపాలనకు కేంద్రబిందువుగా డా.వైఎస్ ప్రజలకు అందించిన సేవలు అపూర్వమన్నారు. డా.వైఎస్ ప్రవేశపెట్టిన జలయజ్ఞం, రైతులకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందని, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా లభించేలా చేశారని, డా. వైఎస్ వంటి నేతలు అరుదని అన్నారు. 108, 104 అత్యవసర వైద్య సేవలు, జలయజ్ఞం ద్వారా సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో గ్రామీణాభివృద్ధికి వైఎస్సార్ విశేష కృషి చేశారని చెప్పారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు, గ్రామ-వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, చేయూత, ఆసరా, కాపు నేస్తం వంటి సంక్షేమ కార్యక్రమాలతో పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైఎస్సార్ అందించిన ప్రజా పాలనను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కమనీయం.. వెంగమాంబ కళ్యాణోత్సవం

## పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే కాకర్ల



దుత్తలూరు మండలం నర్రవాడలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి కళ్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. మంగళవాద్యాలతో వేద మంత్రాలతో అమ్మవారి కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తులపాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలుతీర్చే దేవతగా అమ్మవారి ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతుండడంతో భక్తులు వేలసంఖ్యలో వచ్చి, అమ్మవారి కళ్యాణాన్ని తిలకించి తరించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మహావిష్ణువుకు.. వైభవోపేతంగా గరుడసేవ

నెల్లూరు వేదయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో కొలువైఉన్న శ్రీ మహాలక్ష్మి గోదా దేవి సమేత శ్రీ గురువాయూర్ మహావిష్ణు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీ స్వామివారికి వైభవంగా గరుడవాహనసేవ నిర్వహించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి పూజలు చేసి నగరోత్సవం చేశారు. దాతలు మేడికొండ పద్మమోహన్, స్నేహ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం పర్యవేక్షించారు.

# కూటమి ప్రభుత్వంతోనే.. అభివృద్ధి!

## ● మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



వాటర్ ప్లాంట్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వైసీపీ నాయకులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఏమీ కనిపించదని, ఎంతసేపటికీ ప్రజల మధ్య ఏదో ఒక విధంగా చిచ్చుపెట్టడమే వారి పని అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం తోటపల్లి గూడూరు మండలం పేదూరు పంచాయతీలో 7.75 లక్షలతో ఎస్ఐఐఎల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధి గాడిన పడుతోందని, లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయని, తద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు, ఉపాధి కలుగుతుందని తెలిపారు. వైసీపీ పాలనలో తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కొనసాగివుంటే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దానిని రద్దు చేయడం ఒక వరమని అన్నారు. పేదూరులో 836 మందికి గాను ఇప్పటికి 801 మందికి రాజముద్రతో పాసుపుస్తకాలు కూడా అందాయని,.మరో 35 మందికి కూడా త్వరలోనే వస్తాయని తెలిపారు. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ రెండేళ్లలో ఒక్క పేదూరు పంచాయతీలోనే రూ. 1.19 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.2 కోట్లతో పేదూరు-చింతోపు లింకు రోడ్డు మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభించబోతున్నారని వివరించారు. వైసీపీ నేతలకు ఇలాంటి అభివృద్ధి కనిపించదని, కులమతాల మధ్య చిచ్చురేపడం వంటి దుర్మార్గపు ఆలోచనలు మాత్రం చేస్తుంటారని ఆయన దుయ్యబట్టారు.

# మహిళలను ఆదుకునే.. 'సఖి' కేంద్రాలు

## ● రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

ఆపదల్లో ఉన్న మహిళలకు, సమాజంలో పలు రకాలుగా హింసకు గురైన మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్లు) కేంద్రాలు అండదండలందిస్తూ వారికొక భరోసాగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ చెప్పారు. రాష్ట్ర-జాతీయ మహిళా కమిషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8న నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల (జీజీహెచ్)లో 14 సఖి వన్ స్టాప్ కేంద్రాల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. "ట్రామా-ఇన్‌ఫార్మ్డ్ కేర్, మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ, హింసకు గురైన బాధితులకు సమర్థవంతమైన సేవలందించే విధానాలు" తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ, ఆపదల్లో ఉన్న మహిళలకు సఖి (వన్ స్టాప్ సెంటర్)లు చివరి ఆశ్రయ కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఒకే చోట వైద్య సేవలు, న్యాయ సహాయం, పోలీసు సహకారం, ఎఫ్ఐఆర్ నమోదు, కౌన్సిలింగ్ వంటి సమగ్ర సేవలను అందిస్తూ బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నాయన్నారు. శారీరక వేధింపులు, లైంగిక దాడులు, గృహహింస, యాసిడ్ దాడులకు గురైన మహిళలను గౌరవప్రదంగా ఎలా సంప్రదించాలి, వారి మానసిక స్థితిని అర్థంచేసుకుని ఎలా సహాయపడాలి తదితర అంశాలపై ఈ శిక్షణలో సఖి కేంద్రాల సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించినట్లు వివరించారు.

# విద్యార్థులకు 'నారాయణ' కానుక

## ● ఈనెల 14న..రికార్డుస్థాయిలో 7వేల మందికి సైకిళ్ళు



రూప్‌కుమార్‌యాదవ్

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఈనెల 14న రికార్డు స్థాయిలో 7వేల మంది విద్యార్థులకు సైకిళ్లను కానుకగా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నెల్లూరులోని వి.ఆర్.సి గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆ విషయాలు చెప్పారు. మంత్రి నారాయణ తన చిన్నతనంలో హరనాథపురం నుంచి వి.ఆర్.సి గ్రౌండ్‌కు నడిచి వచ్చి చదువుకుంటూ పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ, ఏ పేద విద్యార్థి కూడా అలా కష్టపడకూడదనే ఉద్దేశంతో నెల్లూరునగర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా, తన సొంత డబ్బులు, కుటుంబ సంపాదనతో ఒక్కొక్కటి దాదాపు 6వేల రూపాయల విలువచేసే సైకిళ్లను హీరో కంపెనీ వారితో స్వయంగా మాట్లాడి విద్యార్థినులకు, విద్యార్థులకు విడివిడిగా ప్రత్యేకంగా డిజైన్ చేయించారని తెలిపారు. నెల్లూరు నగర పరిధిలోని 15 హైస్కూళ్లు, రూరల్ పరిధిలోని 8 హైస్కూళ్లు కలిపి మొత్తం 23 హైస్కూళ్లకు చెందిన 8, 9, 10 తరగతుల చదువుతున్న సుమారు 7,000 మంది విద్యార్థులకు వీటిని అందజేయనున్నారని తెలిపారు. జూలై 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే భారీ బహిరంగ కార్యక్రమంలో ఒకే రోజు ఈ 7,000 సైకిళ్లను పంపిణీ చేయబోతున్నారని, మంత్రి నారాయణతోపాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు.

## పార్టీ కార్యకర్తలకు..

# మంత్రి నారాయణ భారీ సాయం

### 155 మందికి రూ.39.80 లక్షలు అందజేసిన షరణి



కార్యకర్తలకి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ కుమార్తె షరణి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ తన సొంత నిధులను కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. మంత్రి నారాయణ ఇచ్చిన మాట ప్రకారం ఈ ఐదేళ్లకు ఏకంగా 50 కోట్ల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన కార్యకర్తల సంక్షేమ నిధి నుండి స్థానిక టీడీపీ కార్యకర్తలకు మంత్రి నారాయణ కుమార్తె షరణి ఆ సాయాన్ని అందజేశారు. ఇటీవల నెల్లూరు గోమతి నగర్ క్యాంప్ కార్యాలయం వేదికగా జరిగిన కార్యక్రమంలో ఆమేరకు వారికి చెక్కులను ఇచ్చారు. కష్టాల్లో ఉన్నామని ఆర్థికసాయం కోరిన 155 మంది కార్యకర్తలకు 39 లక్షల 80 వేల విలువైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రిగా నెల్లూరు రూపురేఖలు మార్చిన విజనరీ లీడర్ తమ నాన్న అని, సామాన్య కార్యకర్తలకు సైతం ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. నెల్లూరు అభివృద్ధే తమ నాన్న శ్వాస అని, కార్యకర్తల సంక్షేమమే వారి ధ్యాస అని ఆమె అన్నారు. తమ నాన్న ఆశయ సాధనలో తాను కూడా ఒక కార్యకర్తలా అడుగులు వేస్తానన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమం కోసం తన కుటుంబ సంపాదన నుండి ప్రతి ఏటా 10కోట్ల రూపాయలు కేటాయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం మంత్రి నారాయణ ఈ సాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపాడు

# ఆలయ పునర్నిర్మాణానికి.. భూమిపూజ



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆత్మకూరు నియోజకవర్గంలోని చరిత్రాత్మక ఆలయాలకు పూర్వ వైభవం వస్తోంది. ఈనెల 5న చేజర్ల మండలంలోని పెరుమాళ్లపాడు, చేజర్ల, చిత్తలూరు గ్రామాల్లో రూ.5.50 కోట్ల వ్యయంతో మూడు ఆలయాల పునర్నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. పెరుమాళ్లపాడులో పెన్నా నది ఇసుక మేటల కింద పూడిపోయి ఉన్న చరిత్రాత్మక శ్రీ నాగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి 1.50 కోట్ల రూపాయలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. చేజర్ల, చిత్తలూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ.4 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 684 పురాతన ఆలయాల అభివృద్ధి పనులు ప్రారంభించామని, రూ.808 కోట్ల వ్యయంతో ఆ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.రాష్ట్రంలో ఇప్పటికే ఆలయాల్లో ప్రతి నెలా 24 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారని, మరో 111 ఆలయాల్లో అన్నప్రసాద పథకాన్ని విస్తరించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

## సీతారామపురంలో హౌసింగ్ కార్యాలయం తనిఖీ

మండల కేంద్రమైన సీతారామపురంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఈనెల 7న జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.డి జహీరుద్దీన్ తనిఖీచేశారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని, పెండింగ్ పనులను ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. హౌసింగ్ డీ.ఇ పీరా, ఏ.ఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరి నాగేంద్ర సరికొత్త స్వరం 'ఒక అశాంతుడి స్వప్నం'

ఇప్పటివరకు ఎనిమిది కవితా సంపుటాలు ప్రచురించి విజయఢంకా మ్రోగించిన ఏటూరి నాగేంద్ర కవి, ఇప్పుడు తన నూతన కవితా సంపుటి 'ఒక అశాంతుడి స్వప్నం' లిఖించాడు. మానవ జీవితంలోని అన్ని విషాదాలకూ, అన్ని విశేషణాలకు అక్షర లిపిని సమకూర్చడంలో అందెవేసిన చేయి ఏటూరి. నిరంతరం 'రాస్తూనే ఉందాం' అంటూ కవితాత్మకంగా వ్యవహరించే అరుదైన కవుల్లో నాగేంద్రరావు ఒకరు కావడం విశేషం. ఆయన విశిష్టత. ఆయనో నడిచే నిఘంటువు. గతాన్ని వర్తమానాన్ని మస్తిష్కంలో దాచుకొని ఎప్పుడు ఏది కావాలో దాన్ని విప్పి పరచగల మహామేధావి.






రచయిత:
**ఏటూరి నాగేంద్రరావు**
వెల: రూ. 100/- పేజీలు: 108
ప్రతులకు: ఏటూరి నాగేంద్రరావు
ఫ్లాట్ నెం.క్యూజి5, అపర్ణ సైబర్‌జోన్,
నల్లగండ్ల, సెరిలింగంపల్లి, హైదరాబాదు.
సెల్: 7416665323

వర్తమాన కవితా సంపుటిలో ఆయనలోని తాత్వికత పరాకాష్టకు చేరిన సందర్భం. ఆయన ఈ కవితాసంపుటి తొలి కవిత 'దయాపూరిత కనుల స్పర్శ'లో 'ఒక్కణ్ణే అనేక రకాలుగా చీలిపోతుంటాను. ముక్కలన్నీ కలిపి ఒక్కర్నౌతాను' అంటారు. మనిషిలోని భావాల డిఫ్యూషన్ స్టేట్‌ను ఇలా చెప్పగల్గడం ఏటూరికే చెల్లింది. భాష రాని భావం ఆయన్ని సెలైన్‌లా ఆక్రమించుకొందంటారు. సరికొత్త రూపకాలు వాడడంలో ఆయన అత్యంత నేర్పరి. ఇక్కడో సెలైన్‌లా ఆక్రమించుకోవడం అలాంటిదే.

రోడ్లు 'గాయపుకోతలై' మనుషుల్ని బలితీసుకొనే సందర్భాల్ని ప్రశ్నార్థకం అయిపోతున్న భీభత్సాన్ని 'ఏ నిమిషం ఎవరి కన్నీటి చెమ్మను ఎలా పలకరించాలో తెలీటం లేదు' అంటూ మనసు బాధలో నుంచి పుట్టుకొచ్చిన అక్షర సౌందర్యాన్ని మనకు శెలవిస్తారు. అదే కవితలో 'కొన్ని వాక్యాలు రాయాలనుకొన్నపుడు శరీరంలోని రక్తపు చెలమలో ఈదులాడాలి కదా' అని భావోద్విగ్న గీతిక ఆలపిస్తారు. రక్తపు చెలమే కవిత్వానికి ఆయువుపట్టుగా ఆయన అభివర్ణిస్తారు. రోడ్ల కోత నుంచి గుండె కోత వరకు కవిత్వీకరించిన ఘనతర కవి ఏటూరి.

మనిషి తత్వాన్ని రంగరించుకొన్న భావోద్వేగం ఏటూరిది. 'తాంత్రిక మాయ' కవితలో మనిషితనం వ్యాపారంగా మారి 'పక్కా వ్యాపారపు ముసుగులు ధరించి పరాయి వారిగా మారిపోవడాన్ని ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ, కళ్ళలో నుంచి పాముల్ని పొడిచే భీకరమైన మనిషి స్పర్శను భయానకంగా చిత్రీకరిస్తారాయన. ఇలాంటి సన్నివేశాలు ఆయన మనసులోకి చొచ్చుకు వస్తున్నపుడు నాలో నుంచి ఒక నవ్వు వికారంగా, అసహ్యంగా 'మనిషి పట్ల' ఏహ్యాభావంగా వర్ధిల్లుతుందంటారు. మనిషిని చూసి అప్రమత్తంగా మెలగాల్సిన అవసరాన్ని 'చాణుక్యత'తో చాటిచెప్పిన ఏటూరి అభినందనీయుడు. 'గుండె గాయం' కవితలో మనకు మరో గాయం వాసనతో చెలిమి చేయిస్తారు. 'భయాన్ని బయటే నిలబెడితే జీవితం ఎంత బాగుంటుందో కదా!' అనడం అదేమరి. జీవితాన్ని పోరాటంలా ప్రేమించడం నేర్చుకొన్నాక గుండె గాయం కూడా నన్ను ముద్దాడటం నేర్చుకొందని గొప్ప సందేశాన్ని పాఠకులకు చెప్తారు నాగేంద్ర కవీంద్రుడు. ధైర్యమే చివరి చిరునామా కావాలని ఉద్బోధిస్తారాయన. ఆయన మాటల్లో విహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరో కొత్త పదానికి ప్రాణం పోసి కొత్త కవితను సృష్టించారు నాగేంద్ర. అదే 'విషాదమాధుర్యం' కవిత. 'విషాద మాధుర్యాన్ని అనుభవించడం అలవాటు పడ్డాక అగాధాల లోతులు కూడా సౌందర్య చిహ్నాలుగా కన్పిస్తాయి మనిషికి అంటూ లోకమంతా విషాదాన్ని చప్పరిస్తున్నదని విషాదాన్ని విహారంగా మలుచుకొన్నదని ఏటూరి భావన. 'కలల విచ్ఛత్తి' కవితలో 'ఎన్నెన్ని కలలు నా కంటి రెటీనా గుహల్లో కాలిపోతున్నాయో కదా' అని నొచ్చుకుంటారు. అలా అంటూనే బాధాతప్త హృదయులై 'కలల విచ్ఛత్తి నాకేం కొత్త కాదు కదా' అని తనకై తాను అనునయించుకుంటారు కూడా! 'ప్రేమించడం' కవితలో ఓ సవాల్ విసురుతారు 'పూలరెక్కల్లాంటి అక్షరాలను ముట్టుకొని చూడండి ప్రేమించడం ఎలాగో నేర్పుతుంది' అనడం ఓ సరికొత్త భావన. మరో దగ్గర అక్షరాన్ని ముట్టుకొని చూడు భాస్వరమై భగ్గుమంటుంది అంటారు. ఇలా ప్రతిచోటా కొత్త స్వరంగా నాగేంద్రుడై కవితావేశ ఝరిని పదునుగా వెదజల్లిన కవీంద్రుడు ఏటూరి అభినందనీయుడు.



సమీక్ష:
**చిన్ని నారాయణరావు**
సెల్ : 94402 02942

## టూకీగా...



### డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరులో పోలీసు ఇన్స్పెక్టర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఈనెల 7న ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు డీఎస్ఆర్‌బీ ఇన్స్పెక్టర్‌గా ఉన్న ఎన్.రామారావు, డీటీసీ ఆర్ఐ డీ.శ్రీనివాసుల రెడ్డిలు ఆమేరకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు.

### నందివాయిలో.. విద్యార్థులకు విద్యా సామగ్రి

పొదలకూరు మండలం నందివాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత కోవూరు భాగ్యలక్ష్మి అందజేసిన విద్యా సామగ్రిని ఆమె కుమారుడు వేణు ఇటీవల విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్‌లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నవాబుపేటలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

రాపూరు మండలం నవాబుపేట గ్రామ శివారుల్లోని ఓ జూదస్థారంలో పేకాట జోరుగా సాగుతోందన్న సమాచారంతో ఈనెల 5న పోలీసులు దాడిచేసి, అక్కడ పేకాటాడుతున్న 13 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 19,480 రూపాయలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

### కొండ బిట్రగుంటలో వీధికుక్కల దాడి-6 గొర్రెలు బలి

బోగోలు మండలం కొండ బిట్రగుంటలో ఈనెల7వ తేదీ అర్ధరాత్రి సమయంలో డి.నాగేశ్వరరావుకు చెందిన గొర్రెల పాకలోకి దూరిన వీధికుక్కలు ఆరు గొర్రెలను చంపేశాయి. గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్న ఆ బాధితుడు లబోదిబోమంటూ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం వద్దకు వెళ్ళి, తనను ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశాడు.

### కసుమూరులో పాఠశాలకు నోటీసులు

వెంకటాచలం మండలంలోని కసుమూరులో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ఓ పాఠశాలకు మండల విద్యాశాఖ అధికారి సుధీర్ ప్రేమ్‌కుమార్ ఈనెల 7న నోటీసులు జారీచేశారు. ఆ పాఠశాలలో అనధికారికంగా పదోతరగతి వరకు బోధిస్తున్నట్లు ఫిర్యాదులందడంతో ఆయన ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

### బద్దెవోలులో.. సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

కలువాయి మండలం బద్దెవోలు జడ్పీ హైస్కూలులో సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఈనెల 5న కలువాయికి చెందిన దాతలు వనపర్తి కల్యాణ్–హర్షిత దంపతులు భూమి పూజ చేశారు. ఎంఇఓ–2 ఎస్. జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబురావు, హెడ్మాస్టర్ వల్లూరు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. రూ.3 లక్షలతో విగ్రహప్రతిష్ఠ, మండప నిర్మాణం జరగనున్నాయి.

### మారంరెడ్డిపల్లిలో ఓటరు ప్రక్రియ పరిశీలన

సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లి బెస్త కాలనీలో ఇటీవల ఇఆర్ఓ వెంకటరెడ్డి పర్యటించి ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్ళి అర్హులైన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట తహాశీల్దార్ ఫజిహా, ఎంపీడీఓ చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

### కావలిలో 'జ్ఞానజ్యోతి'పై శిక్షణ

చిన్నారులకు ఆటపాటలతో మంచి విద్యను అందించేందుకు అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇస్తున్న 'జ్ఞానజ్యోతి' శిక్షణ కార్యక్రమం ఇటీవల కావలి జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో, ఎంఇఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగింది. కేఆర్‌పీఎస్‌లు సుబ్రహ్మణ్యం, శర్మిష్టలు వారికి శిక్షణ ఇచ్చారు. పలువురు అంగన్‌వాడీ సీడీపీఓలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

### బుచ్చిలో మెకానిక్ డే వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి బద్రుద్దీన్, జిల్లాశాఖ కార్యదర్శి పఠాన్‌నజీర్ పాల్గొని కేకు కట్‌చేసి, మెకానిక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. రూప్‌సింగ్, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.


# కాలం తీరిన.. కలం...

**పాత్రికేయుని జేబులో ఒకప్పుడు కలం ఉండేది. అది కేవలం అక్షరాలను కాగితంపై దింపే సాధనం మాత్రమే కాదు; వాస్తవాలను నమోదు చేసే బాధ్యతకు, భావాలను వ్యక్తీకరించే స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా రంగం నిబద్ధతకు ప్రతీక. నేడు అదే కలం పాత్రికేయుడి జేబు నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమించింది. దాని స్థానంలో స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్ చేరాయి. సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఈ మార్పు అనివార్యమే అయినప్పటికీ, దానితో పాటు కనుమరుగవుతున్న విలువలపై మాత్రం గంభీరమైన చర్చ అవసరం.**

ఒకప్పుడు వార్త అన్నది సంఘటనా స్థలంలోనే పాత్రికేయుడి నోట్‌బుక్‌లో జన్మించేది. ప్రతి మాటను శ్రద్ధగా ఆలకిస్తూ, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నమోదు చేస్తూ, అనుమానాలు నివృత్తి చేసుకుంటూ వార్త రూపుదిద్దుకునేది. ఆ ప్రక్రియలో కలం పాత్రికేయుడి ఆలోచనకు అనుసంధానమై ఉండేది. ఇప్పుడు అదే పని డిజిటల్ పరికరాలు చేస్తున్నాయి. ఆడియో రికార్డింగ్, వీడియో, ప్రత్యక్ష ప్రసారం, క్షణాల్లో సమాచార పంపిణీ.. ఇవన్నీ వార్తా ప్రపంచాన్ని వేగవంతం చేశాయి. అయితే వేగం పెరిగినకొద్దీ లోతు తగ్గకూడదన్న జాగ్రత్త కూడా అంతే అవసరం.

సాంకేతిక పరిజ్ఞానం సమాచార సేకరణను సులభతరం చేసింది. కానీ, సమాచారాన్ని విశ్లేషించే సామర్థ్యాన్ని అది స్వయంగా ఇవ్వదు. వార్తను నమోదు చేసే ప్రక్రియలో చేతితో రాసే అలవాటు పాత్రికేయుడిని మరింత అప్రమత్తుడిగా మార్చేది. ఏది ముఖ్యమో, ఏది ఉపేక్షించవచ్చో ఆలోచించే అవకాశం కలిగించేది. ఇప్పుడు డిజిటల్ పరికరాలు ప్రతి పదాన్ని రికార్డు చేస్తున్నా, ప్రతి విషయాన్ని అర్థం చేసుకునే బాధ్యత మాత్రం మనిషిదే.

ఇది కేవలం కలం కనుమరుగైన కథ కాదు. వృత్తిలో సంభవించిన ఒక మౌన పరివర్తన. ఒకప్పుడు సంపాదకుడి టేబుల్‌పై ఎర్ర సిరా కలం ఉండేది. దిద్దుబాట్లు, సూచనలు, వ్యాఖ్యలు అన్నీ ఆ కలంతోనే నమోదయ్యేవి. ప్రతి దిద్దుబాటు వెనుక భాషపై మమకారం, భావంపై శ్రద్ధ, పాఠకుడిపై బాధ్యత కనిపించేవి. నేడు సాఫ్ట్‌వేర్‌లు అక్షర దోషాలను సరిచేస్తున్నా, భావ దోషాలను సవరించే బాధ్యత మాత్రం అనుభవజ్ఞుడైన సంపాదకుడిదే.



ఇంకో కోణంలో చూస్తే, కలం కనుమరుగవడం ఒక తరం నుంచి మరో తరానికి వృత్తి సంస్కృతి మారిన సంకేతం కూడా. ఒకప్పుడు వార్త కోసం గంటల తరబడి క్షేత్రస్థాయిలో తిరిగిన పాత్రికేయుడు, నేడు డిజిటల్ వేదికల ద్వారా క్షణాల్లో ప్రపంచాన్ని చేరుకోగలుగుతున్నాడు. ఇది అభివృద్ధే. కానీ వేగం పేరుతో వాస్తవ నిర్ధారణను విస్మరించడం, ప్రత్యక్ష పరిశీలనకు బదులుగా సామాజిక మాధ్యమాల సమాచారంపై ఆధారపడడం వంటి ధోరణులు పెరుగుతున్నాయనే విమర్శలను కూడా విస్మరించలేం.

కలం ఒక సాధనం మాత్రమే కాదు; అది ఓ సంస్కారం. రాయడానికి ముందు ఆలోచించడం, రాసిన తర్వాత మరోసారి చదవడం, ప్రతి పదానికి బాధ్యత వహించడం... ఇవి కలం అలవాటు చేసిన విలువలు. కీబోర్డ్ ఆ విలువలకు ప్రత్యామ్నాయం కాదు; కేవలం మరో సాధనం మాత్రమే. సాధనం మారడం సహజం. కానీ సాధన వెనుక ఉన్న నైతికత, నిబద్ధత, వృత్తి ధర్మం మారితేనే అసలు ప్రమాదం.

నేడు కృత్రిమ మేధ వార్తలను ముసాయిదా చేయగలుగుతోంది. స్వయంచాలక వ్యవస్థలు నివేదికలను రూపొందిస్తున్నాయి. అయినప్పటికీ వార్తకు ప్రాణం పోసేది యంత్రం కాదు; సంఘటనను అర్థం చేసుకున్న పాత్రికేయుడి దృష్టి. నిజాన్ని వెలికితీసే తపన, వ్యవస్థలని ప్రశ్నించే ధైర్యం, ప్రజల తరఫున నిలిచే నిబద్ధత... వీటిని ఏ సాంకేతికతా భర్తీ చేయలేదు, చేయడం సాధ్యం కాదు.

అందుకే కలం పట్ల వ్యామోహం అవసరం లేదు; కలం ప్రతిబింబించిన విలువల పట్ల నిబద్ధత అవసరం. జేబులో కలం లేకపోయినా మనసులో నిజాయితీ ఉండాలి. చేతిలో నోట్‌బుక్ లేకపోయినా వాస్తవాలను నమోదుచేసే బాధ్యత ఉండాలి. కీబోర్డ్‌పై వేళ్లు పరుగులు తీసినా, ప్రతి అక్షరం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేదిగా ఉండాలి.

కాలం కలాన్ని పక్కన పెట్టుండొచ్చు. కానీ కలం నిలబెట్టిన సత్యనిష్ఠను, బాధ్యతను, వృత్తి గౌరవాన్ని కాలం ఎప్పటికీ పక్కన పెట్టకూడదు. పత్రికా రంగం సాంకేతికంగా ఎంత ఆధునికమైనా, దాని అసలు బలం కలంలో కాదు... కలం వెనుక నిలిచిన విలువల్లోనే ఉంది. ఆ విలువలు నిలిచినంతకాలం పత్రికా రంగం జీవించి ఉంటుంది; అవి క్షీణించిన రోజున చేతిలో కలం ఉన్నా, లేకపోయినా ప్రయోజనం ఉండదు.

- శివ

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో..

# అధ్యాపకుల పాత్ర కీలకం

### డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి



శాస్త్ర సాంకేతికరంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు అధ్యాపకుల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ప్రముఖ శాస్త్రవేత్త డా. జి.సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'దేశంలో అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ మరియు రక్షణ పరిశోధన, అభివృద్ధి : విద్యాసంస్థల పాత్ర' అనే అంశంపై జరిగిన ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రక్షణ రంగంలో మనదేశం సాధించిన అద్భుతమైన ప్రగతిని వివరించారు. పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యాలు మరియు రక్షణ సన్నద్ధత కారణంగా, అమెరికా, రష్యా, మరియు చైనాల తర్వాత భారతదేశం ప్రపంచంలో నాల్గవ అత్యంత శక్తివంతమైన రక్షణ శక్తిగా ఆవిర్భవించిందని చెప్పారు. దేశ రక్షణ రంగ ఎగుమతులు ఇప్పుడు 24వేల కోట్ల నుంచి 30వేల కోట్ల రూపాయలకు పెరిగాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.50వేల కోట్లుగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ చొరవ కింద స్వదేశీ రక్షణ సాంకేతికతలు, ఉత్పాదక సామర్థ్యాలు వేగంగా అభివృద్ధి చెందడమే ఈ స్థిరమైన వృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థల పాత్రను గురించి చెప్తూ, ఐఐటీలు, కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఇతర పరిశోధనా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులకు డీఆర్డీఓ రూ.1,200 కోట్లు కేటాయించిందని, సైన్స్, టెక్నాలజీలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యమని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, వ్యవసాయం, రక్షణ ఆవిష్కరణ వంటి రంగాలలో భారతదేశంలో ఇప్పుడు దాదాపు 2.5 లక్షల స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఆయన వివరించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.భూపతినాయుడు తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఎస్.వి.యు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రొఫెసర్ చంద్రరాయుడు, ప్రొ. దామోదర్‌రెడ్డి, అధ్యాపక బృందం, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com